సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 28.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 328
పేజీలు: 08 వెల: రూ. 5

## 30 రోజుల ప్లాన్ తప్పనిసరి: ట్రాయ్

ఏడాదికి 13 సార్లు కాకుండా 12 సార్లు రీఛార్జ్

- ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు అందుబాటులో ఇకపై 30 రోజుల ప్లాన్
- డేటా లేకుండా కేవలం వాయిస్, ఎస్ఎంఎస్ ప్యాక్‌లు కూడా తప్పనిసరి
- ప్రతి నెలా ఒకే తేదీన రెన్యూవల్ చేసుకునేలా ప్రత్యేక ప్లాన్
- తక్కువ బడ్జెట్ వినియోగదారులకు అనుకూలంగా మారిన నిబంధనలు

02




## జాతీయస్థాయిలో మెరిసిన ఏపీ

అధికారులకు చంద్రబాబు అభినందనలు 02

- అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రచారానికి దక్కిన గుర్తింపు
- ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో గోల్డ్ అవార్డు
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ పురస్కారం



## సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ

క్షమాపణ చెప్పాలని డిమాండ్ 02

- సిరిసిల్ల ఆరోపణలపై కేటీఆర్ ఫైర్..
- శ్వేతపత్రం విడుదల చేయాలి.. ఆ తర్వాతే సిరిసిల్లకు రండి
- 8 వేల ఎకరాల భూ దోపిడీపై ఆధారాలేవి?
- ఆరోపణలు నిరూపించకపోతే బహిరంగ క్షమాపణ చెప్పాలి
- నేతన్నల బకాయిలు చెల్లించండి..
- బీమా పథకాలు పునరుద్ధరించండి



## ఏఐ ట్రైనింగ్ నిలిపివేత.. 02

ఏఐ ఏజెంట్ల దూకుడుతో ఓపెన్ఏఐ కీలక నిర్ణయం

- భద్రతా లోపాలపై ఓపెన్ఏఐ అలర్ట్
- అమెరికా ప్రభుత్వ సైట్లపై ఏఐ ఏజెంట్ల హల్‌చల్
- భద్రతా వ్యవస్థలు పటిష్టం చేశాకే మళ్లీ శిక్షణ




## తెలంగాణపై బీజేపీ

# స్పెషల్ ఫోకస్

## వీక్ ఏరియాలే టార్గెట్‌గా వ్యూహం

### వరంగల్ కేంద్రంగా బీజేపీ కార్యాచరణ

- ఉమ్మడి ఖమ్మం, నల్గొండపై ప్రత్యేక దృష్టి
- దశరథ్‌కు కీలక బాధ్యతలు
- బీఎల్ సంతోష్ టీమ్ రంగంలోకి
- ఎమ్మెల్సీ ఎన్నికలే తొలి పరీక్ష
- కేడర్ బలోపేతంపై అధిష్ఠానం ఫోకస్
- అసెంబ్లీ ఎన్నికలే అసలు టార్గెట్
- బలహీన జిల్లాల్లో పట్టు కోసం ప్లాన్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. సంస్థాగతంగా బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్ఠానం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే ఈ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచడంతో పాటు.. క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**వరంగల్ కేంద్రంగా వ్యూహం**

రాష్ట్రంలో బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నప్పటికీ అన్ని ప్రాంతాల్లో పార్టీకి సమానమైన బలం లేదన్నది అధిష్ఠానం అంచనా. కొన్ని జిల్లాల్లో గట్టి పట్టు ఉన్నా.. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో మాత్రం పార్టీ ప్రభావం ఆశించిన స్థాయిలో లేదని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూడు ఉమ్మడి జిల్లాలను కలుపుతూ ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దశరథ్‌ను వరంగల్ కేంద్రంగా పనిచేసేలా బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కు దశరథ్ అత్యంత సన్నిహితుడిగా పార్టీలో పేరుంది. దీంతో ఆయనకు కీలక నిర్ణయాల విషయంలో అధిష్ఠానం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కాషాయ వర్గాలు చెబుతున్నాయి.

**ఎమ్మెల్సీ ఎన్నికలే ట్రయల్ రన్?**

వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీజేపీ ఒక రకంగా ట్రయల్ రన్‌గా భావిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో పార్టీ కేడర్ పరిస్థితి, ఓటు బ్యాంక్, బూత్ స్థాయి బలం, నాయకత్వ సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు పార్టీకి బలం ఉన్న ప్రాంతాల్లోనే ఓటు శాతం పెరుగుతోందని.. బలహీన ప్రాంతాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని అధిష్ఠానం గుర్తించినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి స్పష్టమైందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**అసెంబ్లీ ఎన్నికలే అసలు లక్ష్యం**

ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఈ ప్రాంతాల్లో పార్టీ పనితీరును సమీక్షించి.. లోటుపాట్లను సరిదిద్దే దిశగా ముందుకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉండేలా నాయకులు, కేడర్‌కు ప్రత్యేక టార్గెట్లు ఇవ్వనున్నట్లు సమాచారం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలంటే బలహీనంగా ఉన్న జిల్లాల్లో పట్టు సాధించడం తప్పనిసరని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే సంస్థాగత మార్పులు, ఇన్‌చార్జ్‌ల మిగతా 02లో

# కౌశిక్‌రెడ్డిపై వేటు

## షాకిచ్చేందుకు కాంగ్రెస్ ప్లాన్

- హుజూరాబాద్‌లో ఉప ఎన్నికకు రంగం సిద్ధం?
- ఎథిక్స్ కమిటీ ముందుకు కౌశిక్‌రెడ్డి వ్యవహారం
- దానం ఎపిసోడ్‌తో మరింత వేడెక్కిన రాజకీయం
- వేటా.. రాజీనామానా.. కౌశిక్‌రెడ్డికి టెన్షన్!
- రెండు వారాల్లో కీలక నిర్ణయం?
- తెరవెనుక పాలిటిక్స్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాలు మరింత హాట్ హాట్‌గా మారుతున్నాయి. బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్ పంచకు చేరిన దానం నాగేందర్‌పై కోర్టులు వేటు వేసిన నేపథ్యంలో దీనికి ప్రతిగా ఇప్పుడు బీఆర్ ఎస్ ఫైర్ బ్రాండ్ నాయకుడు, హుజూరాబాద్ నుంచి ఫస్ట్‌టైమ్ విజయం దక్కించుకున్న పాడి కౌశిక్ రెడ్డికి చెక్ పెట్టేదిశగా కాంగ్రెస్ పార్టీపావులు కదుపుతోందన్న చర్చ జోరుగా సాగుతోంది. అసెంబ్లీ నియమాలను ఉల్లంఘించడం.. సభా వేదికగా సభ్యులను బెదిరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాడికి.. అవే నియమాలు ఇప్పుడు ఉచ్చుగా మారే ప్రమాదం ఏర్పడిందని అంటున్నారు.

ఈ క్రమంలో పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ద్వారానే అనర్హత వేటు వేయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని బీఆర్ ఎస్ నాయకులు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇదే జరిగితే.. ఖైరతాబాద్‌తో పాటు హుజూరాబాద్‌కు కూడా ఒకే సారి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని అంచనా అంటున్నారు. అయితే.. దీనిని కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య అని బీఆర్ ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాదు.. సభను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తంగా ఇప్పుడు పాడి చుట్టూ రాజకీయం మరోసారి రాజుకుంది.

ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో పాడి కౌశిక్ రెడ్డి సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ మిగతా 02లో

# సీలింగ్ భూములకు మోక్షం

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం




- దశాబ్దాలుగా పెండింగ్‌లో దరఖాస్తులు
- తాజా ఉత్తర్వులతో పరిష్కారానికి శ్రీకారం
- 22ఏ సమస్యలకు సత్వర పరిష్కారం
- ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించాలని ఆదేశాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీవో నెం.455, 456, 747, 92 కింద ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరోవైపు 22A భూముల సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. జీవో 118, 76కు అనుగుణంగా చర్యలు మిగతా 02లో

## 2027 మినీ మేడారం జాతర తేదీలు ఖరారు 02

- ఫిబ్రవరి 17 నుంచి మినీ మేడారం
- జాతర తేదీలు ఫిక్స్
- సమ్మక్క-సారలమ్మల మినీ జాతర షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 20న ముగియనున్న మినీ జాతర



## రైల్వేలకు కొత్త రూపు

రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు

- దేశంలో తొలి ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం
- రైల్వే విద్యుదీకరణలో భారత్ దూసుకెళ్తోంది
- డీజిల్ వినియోగం తగ్గించా.. రైల్వేల్లో కొత్త మార్పులు
- దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

02



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 28.09.2026
www.mudranews.in | @mudranews


## కడుపు ఉబ్బరం : నీరు ఎక్కువ తాగండి



శరీరంలో నీరు తక్కువగా ఉంటే మలబద్ధకం సమస్య పెరిగి కడుపు ఉబ్బరానికి దారి తీయొచ్చు. రోజంతా తగినంత నీరు తాగడం జీర్ణక్రియకు సహాయపడుతుంది.

# ఏఐ ట్రైనింగ్ నిలిపివేత




**ముద్ర, ఢిల్లీ :**
కృత్రిమ మేధస్సు (ఏఐ) ఏజెంట్లు తమకు నిర్దేశించిన పనుల పరిధిని దాటి వ్యవహరిస్తున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో చాట్ జీపీటీ యాజమాన్య సంస్థ ఓపెన్ఏఐ సంచలన నిర్ణయం తీసుకుంది. తన అత్యాధునిక AI మోడళ్ల శిక్షణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సంస్థ వెల్లడించింది. మరింత పటిష్టమైన భద్రతా నియంత్రణలు, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాటి పనితీరును ధ్రువీకరించిన తర్వాతే శిక్షణను పునః ప్రారంభిస్తామని తెలిపింది.
ఈ నిర్ణయానికి ముందు అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్లకు సంబంధించి పలు అనూహ్య ఘటనలను ఓపెన్ఏఐ వెల్లడించింది. శిక్షణ, మూల్యాంకన ప్రక్రియల్లో ఉన్న కొన్ని ఏఐ ఏజెంట్లు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC), సెన్సస్ బ్యూరో తదితర ప్రభుత్వ వనరుల నుంచి సమాచారాన్ని సేకరించాయి. కొన్ని సందర్భాల్లో ఏజెంట్లు తమకు అప్పగించిన పనిని మించి వ్యవహరించాయి. ఉదాహరణకు ఎస్ఈసీ వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి మరో వెబ్‌సైట్‌లో ప్రచురించిన ఘటన ఓపెన్ఏఐ గుర్తించింది. ఎస్ఈసీ ప్రకారం ఎలాంటి ప్రైవేట్ లేదా పబ్లిక్ కాని సమాచారం యాక్సెస్ కాలేదు.
అమెరికా విద్యాశాఖకు సంబంధించిన ఘటన మరింత ఆందోళన కలిగించింది. స్వతంత్ర ఏఐ పరిశోధనా సంస్థ ట్రాన్స్‌ల్యూస్ ప్రకారం, ఓపెన్ఏఐకి చెందినవిగా కనిపించిన ఏజెంట్లు విద్యాశాఖ సివిల్ రైట్స్ వెబ్‌సైట్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించాయి. అయితే ఆ ప్రయత్నం విఫలమైంది. ఈ ఘటనను ఓపెన్ఏఐ స్వయంగా ఇంకా ధ్రువీకరించలేదు. విద్యాశాఖ కూడా తమ వెబ్‌సైట్ లేదా డేటాబేస్‌పై ప్రభావం పడినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది.

# సీఎంకు కేటీఆర్ లేఖ



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. సిరిసిల్లపై సీఎం చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ కేటీఆర్ పలు కీలక డిమాండ్లు తెరపైకి తెచ్చారు.

**శ్వేతపత్రం విడుదల చేశాకే సిరిసిల్లలో అడుగుపెట్టాలి..**
సిరిసిల్లలో 8 వేల ఎకరాలు దోచుకున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ లేఖలో మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరోపణలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆ తర్వాతే సిరిసిల్లలో అడుగుపెట్టాలని సవాల్ విసిరారు. ఒకవేళ ఆరోపణలు నిజమే అయితే ఆర్టీఐ కింద పూర్తి వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. వేల ఎకరాల భూ దోపిడీ ఆరోపణలను నిరూపించకపోతే ముఖ్యమంత్రి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**నేతన్నల బకాయిలు చెల్లించాలి..**
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలవ్వలేదని విమర్శించారు. నేతన్నలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.60 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పేద మహిళలకు, చేనేత కార్మికులకు అండగా నిలిచే 'బతుకమ్మ చీరల పథకం' నిలిపివేయడం ద్వారా వేలాది మంది నేతన్నలను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిలిచిపోయిన రైతు బీమా, నేతన్న బీమా పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# 30 రోజుల ప్లాన్ తప్పనిసరిగా అందించాలి



**ముద్ర, న్యూఢిల్లీ:**
దేశవ్యాప్తంగా ఉన్న ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) భారీ ఊరట కల్పించాయి. ఇకపై టెలికాం కంపెనీలు తప్పనిసరిగా 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్‌లను అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. అంతేకాకుండా, డేటా అవసరం లేని వారి కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ లతో కూడిన ప్లాన్‌లను కూడా అందుబాటులో ఉంచాలని నిర్దేశించాయి. ఈ మేరకు "టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్స్, 2026"ను విడుదల చేశాయి.
ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రస్తుతం చాలా కంపెనీలు అందిస్తున్న 28 రోజుల ప్లాన్‌ల కారణంగా వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తోంది. తాజా ఆదేశాలతో ఇకపై 30 రోజుల ప్లాన్ తప్పనిసరి కావడంతో, ఏడాదికి 12 రీఛార్జ్‌లు సరిపోతాయి. వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పించేందుకు, ప్రతి నెలా ఒకే తేదీన రెన్యూవల్ అయ్యేలా ఒక ప్రత్యేక ప్లాన్‌ను కూడా అందించాలని ట్రాయ్ టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ మార్పుల వెనుక రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా కీలక పాత్ర పోషించారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తాను ఈ విషయాన్ని మార్చి 11న పార్లమెంటులో ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన, సరసమైన ఆప్షన్లు ఇవ్వాలని కోరానని, తన విజ్ఞప్తిని మన్నించి ఈ సమస్యను పరిష్కరించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయ్‌కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.
గతంలో వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్‌లపై నిబంధనలు తెచ్చినా, కంపెనీలు ఎక్కువ వ్యాలిడిటీ ఉన్న డేటా-బండిల్డ్ ప్లాన్‌లనే ప్రోత్సహిస్తున్నాయని ట్రాయ్ గుర్తించింది. దీనివల్ల కేవలం వాయిస్ కాల్స్ కోసం మొబైల్ వాడే తక్కువ ఆదాయ వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారని అభిప్రాయపడింది. వినియోగదారులకు వారి అవసరాలు, ఆర్థిక స్తోమతకు అనుగుణంగా రీఛార్జ్ చేసుకునే స్వేచ్ఛను కల్పించడమే ఈ కొత్త నిబంధనల లక్ష్యమని ట్రాయ్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో కోట్లాది మంది ప్రీపెయిడ్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

# జాతీయస్థాయిలో మెరిసిన ఏపీ



**ముద్ర, అమరావతి :**
డిజిటల్ పాలన, సాంకేతిక ఆవిష్కరణలలో ఆంధ్రప్రదేశ్ మరోసారి జాతీయ స్థాయిలో తన సత్తా చాటిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రానికి చెందిన రెండు కీలక ప్రభుత్వ విభాగాలకు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాలను సాధించిన ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ (ఏపీడీసీ), సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ&పీఆర్) అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకి వెళితే, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి చేపట్టిన డిజిటల్, సోషల్ మీడియా ప్రచారం, అవగాహన కార్యక్రమానికి గాను ఏపీడీసీకి గోల్డ్ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా అత్యంత పరిమిత సంఖ్యలో ప్రకటించిన గోల్డ్ అవార్డులలో ఒకటి మన రాష్ట్రానికి దక్కడం గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. ఈ గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ వినియోగంలో ఎంత ముందుందో చాటుతోందని అన్నారు. అదేవిధంగా, మీడియా అక్రిడిటేషన్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం సమాచార, పౌర సంబంధాల శాఖకు సిల్వర్ అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా ఇచ్చిన 30 సిల్వర్ అవార్డుల్లో ఏపీకి ఒకటి దక్కడం హర్షణీయమని చంద్రబాబు తెలిపారు. సాంకేతిక ఆధారిత పాలన, డిజిటల్ ఆవిష్కరణలలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న పురోగతికి ఈ జాతీయ స్థాయి గుర్తింపు ఒక నిదర్శనమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ విజయం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గర్వకారణమని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులను ప్రోత్సహించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించడంలో టెక్నాలజీ పాత్రను ఆయన ఈ సందర్భంగా మరోసారి నొక్కి చెప్పారు.

# మోదీ పాలనలో రైల్వేలకు కొత్త రూపు



**ముద్ర, ముంబై:**
నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారతీయ రైల్వే రూపురేఖలను పూర్తిగా మార్చివేసిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తెలిపారు. విద్యుదీకరణ విస్తరణ, డీజిల్ వినియోగం తగ్గించడం, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ వంటి చర్యల ద్వారా రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. ఇదే సమయంలో.. గత కాంగ్రెస్ ప్రభుత్వం తన హయాంలో భారీ కుంభకోణాలు, అవినీతి తప్ప మరేమీ సాధించలేదని ఆయన విమర్శించారు.
గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో దేశంలోనే మొట్టమొదటి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుతో పాటు WAG-12 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను అమిత్ షా ప్రారంభించారు. దీంతో పాటు సబర్మతి డివిజన్‌లో రూ.1,472 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, రాపిడ్ రైల్ వ్యవస్థలు, ప్రీమియం స్టేషన్ల అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు. అంతేకాకుండా.. హైడ్రోజన్ రైలును అందుబాటులోకి తేవడం ద్వారా భారత్ ప్రపంచంలోని అత్యంత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొన్ని ఎంపిక చేసిన దేశాల సరసన చేరిందని చెప్పారు.
ప్రయాణికుల సౌకర్యార్థం, భద్రత, రైలు కనెక్టివిటీ పెంపు లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను ప్రారంభించినట్లు అమిత్ షా తెలిపారు. వీటిలో రైల్వే లైన్ల రెట్టింపు (లైన్-డబ్లింగ్) పనులు, 'కవచ్' స్వదేశీ రైలు రక్షణ వ్యవస్థ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్, WAG-12 ఎలక్ట్రిక్ లోకోమోటివ్ నిర్వహణ షెడ్ ప్రధానమైనవని వివరించారు. రైల్వేలలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించామని, 2015-16లో 293 కోట్లుగా ఉన్న డీజిల్ వినియోగం 2024-25 నాటికి 108 కోట్లకు తగ్గిందని, 2030 నాటికి దీనిని సున్నాకి తీసుకెళ్లడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గతంలో సంవత్సరానికి సగటున 75 కిలోమీటర్లు మాత్రమే ఉన్న విద్యుదీకరణ పనులు, 2023-24 నాటికి ఏటా 7,188 కిలోమీటర్లకు పెరిగాయని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 99.6 శాతం రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన 0.3 శాతాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. రైళ్లలో 97 శాతం బయో-టాయిలెట్ల ఏర్పాటు, 87 శాతం ఎల్హెచ్‌బి కోచ్‌ల స్వదేశీ ఉత్పత్తి, రైల్వే భద్రతా బడ్జెట్‌లో 67 శాతం పెరుగుదల, లోకోమోటివ్ తయారీ సామర్థ్యంలో 66 శాతం వృద్ధి సాధించామని గుర్తుచేశారు.
ముంబై నుండి వడోదర వరకు మొదటి సుదీర్ఘ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతమైందని, ఇది సరుకు రవాణా సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు 2040 నాటి అవసరాలను తీరుస్తుందని అన్నారు. సుమారు 11,000 కిలోమీటర్ల రైల్వే కారిడార్లను ఫోర్-ట్రాక్ నెట్‌వర్క్‌లుగా మారుస్తున్నామని, దీని ద్వారా రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. గుజరాత్‌కు రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2009-14లో రూ.589 కోట్లు మాత్రమే ఉండగా, 2026-27 నాటికి అది రూ.17,366 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, సీనియర్ రైల్వే అధికారులు ఉన్నారు.

# సీలింగ్ భూములకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)
చేపట్టామని, మిగిలిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరిస్తామని వెల్లడించింది. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ULC పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 2016లో జీవోలు జారీ చేసినప్పటికీ అప్పట్లో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.
ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం తాజాగా మెమో నెం.48062 జారీ చేసినట్లు వెల్లడించారు. జీవో నెం.455, 456, 747, 92 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అర్హత కలిగిన ప్రతి కేసును సంబంధిత నిబంధనలు, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనలో భూమికి సంబంధించిన పత్రాలు, గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన భూ యజమానులకు నిబంధనల ప్రకారం పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

**22A భూముల సమస్యలపైనా ప్రత్యేక దృష్టి**
రాష్ట్రంలో భూములు 22A నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీల మేరకు ఈ అంశాన్ని దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 22A సమస్యలకు సంబంధించి మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జీవో నెం.118, జీవో నెం.76కు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంది. భూములు 22A జాబితాలో ఉన్నప్పటికీ చట్టబద్ధమైన అనుమతులు కలిగిన కొన్ని ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపింది. అయితే 22A జాబితాలో ఉన్న ప్రతి భూమికి ఒకే విధమైన పరిష్కారం వర్తించదు. భూమి స్వభావం, యాజమాన్య పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టపరమైన అర్హతలను పరిశీలించిన తర్వాతే సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అర్హులైన వ్యక్తుల సమస్యలను పరిష్కరించడం ఈ ప్రక్రియలో కీలకమని ప్రభుత్వం పేర్కొంటోంది.
ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలకు అదనంగా.. మిగిలిన 22A భూ సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఒక్కో కేసును పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించింది. ULC, 22A సమస్యల పరిష్కారంతో భూ యజమానులకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు, అర్హత ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం కానుంది. అయితే.. తాజా మెమో అమలు, దరఖాస్తుల పరిశీలన, సంబంధిత ఉత్తర్వుల ఆధారంగా కేసుల పరిష్కారం ఎలా సాగుతుందన్నది కీలకంగా మారింది.

## 2027 మినీ మేడారం
# జాతర తేదీలు ఖరారు

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జరిగే శ్రీ సమ్మక్క-సారలమ్మల మినీ జాతర తేదీలు అధికారికంగా ఖరారయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మినీ మేడారం జాతర జరగనుంది. ఈ మేరకు మేడారంలోని 'పూజారుల (వడ్డెలు) సంఘం' సభ్యులు మినీ జాతర నిర్వహణ తేదీలను ప్రకటించారు. ఈ వివరాలతో కూడిన పత్రాన్ని వారు రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి లేఖ ద్వారా తెలియజేశారు. 17 ఫిబ్రవరి 2027న జాతర ప్రారంభం, సాంప్రదాయ పూజా కార్యక్రమాలు, 18న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులు, 20 ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మేడారంలో ఆదివాసీ గిరిజన దైవాలు సమ్మక్క-సారలమ్మల మహా జాతరను ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం నిర్వహించడం ఆనవాతీగా వస్తోంది. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి మేడారంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ "మేడారం మహా జాతర" జరుగుతుంది. మహా జాతర లేని మరుసటి సంవత్సరం ఈ మినీ జాతరను నిర్వహిస్తారు. మహా జాతర సమయంలో రద్దీ వల్ల రాలేకపోయిన భక్తులు, మొక్కులు తీర్చుకోలేకపోయిన వారు ఈ మినీ జాతర సమయంలో మేడారం వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటారు.

# కౌశిక్‌రెడ్డిపై వేటు!

(మొదటి పేజీ తరువాయి)
నుంచి గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అడ్డుకోవడంతోపాటు.. "నువ్వు" అని ఏకవచనంతో సంబోధించారు. అంతేకాదు.. దుర్భాషలాడారన్నది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణ. అంతేకాదు.. తనను కాల్చేస్తానని కౌశిక్ రెడ్డి బెదిరించినట్టు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కడియం ఆరోపిస్తున్నారు. దీంతో వ్యవహారం ముదిరిపోయి.. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి ఈ విషయాన్ని రిఫర్ చేశారు.
ప్రస్తుతం ఈ కమిటీ తీవ్రంగా శోధిస్తోంది. పాడిపై వచ్చిన ఆరోపణలు, ఆయన హావభావాలను వీడియోల రూపంలో కూడా పరిశీలన చేస్తోంది. కాగా.. ఇంతలోనే దానం వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు పాడి విషయం మరింత సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ తీసుకునే నిర్ణయం అత్యంత ముఖ్యంగా మారడంతో పాడిపై వేటు వేయించడమో.. లేక రాజీనామాకు సిఫారసు చేయడమో ఖాయమని అంటున్నారు ఎథిక్స్ కమిటీ అనేది రాజ్యాంగ బద్ధమైన కమిటీ కావడం, దీనికి స్పీకర్ అనుమతి ఉండడంతో ఈ కమిటీ నిర్ణయాన్నికోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదని అంటున్నారు.
ఇదే జరిగితే.. పాడి అనర్హుడు కావడమో.. రాజీనామా చేయడమో తప్పదు. దీంతో హుజూరాబాద్‌కు కూడా ఉప ఎన్నిక తీసుకురావాలన్నది కాంగ్రెస్ ప్లాన్‌గా చెబుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. తను వివరణ ఇచ్చేందుకు ఆరు వారాలు గడువు ఇవ్వాలంటూ..పాడి కోరి మూడు వారాలైంది. దీంతో మరో రెండు వారాల్లోనే ఆయనపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

# తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)
నియామకాలు, కీలక నేతలకు బాధ్యతల అప్పగింత జరుగుతున్నాయని అంటున్నాయి. మొత్తంగా.. వరంగల్ కేంద్రంగా ప్రారంభమయ్యే ఈ కొత్త కార్యాచరణ బీజేపీకి ఎంత వరకు ఫలితాన్నిస్తుందన్నది వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేలనుంది. ఈ ఎన్నికల్లో పార్టీ ప్రదర్శనే.. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ వ్యూహం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చెప్పే తొలి సంకేతంగా మారే అవకాశం ఉంది.

## కడుపు ఉబ్బరం : గ్యాస్ పెంచే ఆహారాలు తగ్గించండి

బీన్స్, క్యాబేజీ, శీతల పానీయాలు, అధిక కొవ్వు పదార్థాలు కొందరిలో గ్యాస్‌ను పెంచుతాయి. ఉబ్బరం తరచుగా ఉంటే వీటిని తగ్గించి చూడండి.



## బీఆర్ఎస్‌పై ప్రజలకు ప్రేమ తగ్గలేదు: కేటీఆర్



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ కు అధికారం మాత్రమే పోయిందని.. పార్టీ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమ ఇంకా తగ్గలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని విమర్శించారు. శంషాబాద్ లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్లో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. శాంతిభద్రతలు సైతం సరిగా లేవని.. పోలీసులు కూడా కాంగ్రెస్ నేతల మాటలే వింటున్నారని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెండేళ్లలో మళ్లీ బీఆర్ ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు.

## హైదరాబాద్ - బెంగళూరు హైవేపై కారు దగ్ధం



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై శంషాబాద్ వద్ద కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై.. రోడ్డు పక్కన ఆపి కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అందరూ చూస్తుండగానే క్షణాల్లో కారు పూర్తిగా కాలిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన తోటి వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. దీంతో రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఆర్జీఐఏ పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ లేదా ఇంజన్ వేడెక్కడం వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## హైదరాబాద్ లో 'పింక్ పవర్ రన్ 3.0'.. ప్రముఖుల సందడి




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఎమ్ఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పింక్ పవర్ రన్ 3.0' అట్టహాసంగా సాగింది. ఆరోగ్యం, వెల్‌నెస్, సామాజిక సాధికారతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. 3కె, 5కె, 10కె, 20కె విభాగాల్లో నిర్వహించిన పరుగు పోటీల్లో 30 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, మంత్రి సీతక్క, డీజీపీ సీవీ ఆనంద్, మాజీ మిస్ వరల్డ్ ఓపల్ సుచాత, నటుడు సిద్ధు జొన్నలగడ్డ తదితరులు హాజరయ్యారు. ఎమ్ఈఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి సైతం 10కే రన్‌లో పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరుకు నీటి విడుదల



**ముద్ర, కరీంనగర్ :** పెద్దపల్లి జిల్లా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి మధ్య మానేరుకు గోదావరి జలాల తరలింపు కొనసాగుతోంది. ఆదివారం నంది మేడారంలోని నంది పంపు హౌస్, రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపు హౌస్‌లో నాలుగు మోటర్ల చొప్పున నడిపిస్తున్నారు. దీంతో 12,600 క్యూసెక్కుల నీరు నంది మేడారం మీదుగా వరద కాలువ ద్వారా మధ్య మానేరులోకి చేరుతోంది. అక్కడి నుంచి దిగువ మానేరుకు వదులుతున్నారు.

## చిట్టీలతో భారీ స్కామ్.. రూ.10 కోట్లతో ఉపాధ్యాయుడు పరార్



**ముద్ర, సూర్యపేట :** సూర్యాపేట జిల్లాలో భారీ మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10 కోట్ల చిట్టీ డబ్బుతో పరారయ్యాడు. చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసిన ఉపాధ్యాయుడు, సొమ్ముతో ఉడాయించినట్లు గుర్తించి బాధితులు కన్నీరు పెట్టుకుంటున్నారు. వారంతా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. లక్ష్మీనాయక తండా పరిధిలోని యేనెగండి తండాకు చెందిన బానోతు రాజు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10 కోట్ల చిట్టీల డబ్బులతో పరారయ్యాడు. బాధితుల్లో బంధువులు, ప్రాణ స్నేహితులు ఉన్నారు. జరిగిన మోసాన్ని గుర్తించి జిల్లా ఎస్పీ నరసింహకు ఫిర్యాదు చేశారు. తమ డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు.

## చెన్నూరులోలో కనువిందు చేసిన పొగమంచు

**ముద్ర, కరీంనగర్:** ఉత్తర తెలంగాణలో పలు చోట్ల పొగమంచు కనువిందు చేసిం ది. మంచిర్యాల జిల్లా చెన్నూరులో 63వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హెడ్ లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో తెల్లవారుజామున పొగమంచు అలముకుంది.

# ఆల్విన్ కాలనీ సర్కిల్-51 పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు..

**- భాగ్యనగర్ ఫేజ్-3లో నిబంధనలకు తిలోదకాలు!**

**ముద్ర కూకట్ పల్లి :** హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలలో అనధికారిక కట్టడాలు, అధికారుల ఉదాసీనత స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా ఆల్విన్ కాలనీ, సర్కిల్–51 పరిధిలోని భాగ్యనగర్ ఫేజ్–3 ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు కలకలం రేపుతున్నాయి. భాగ్యనగర్ ఫేజ్–3 లోని 183, 183/1, 184, 184/1 విభాగాలకు చెందిన ప్లాట్లలో నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. మూడు భవనాలకు కేవలం రెండు అంతస్తుల నిర్మాణానికి మాత్రమే అనుమతులు పొం ది, క్షేత్రస్థాయిలో మాత్రం ఏకంగా ఐదు అంతస్తుల భవనా లను నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వెనుక స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం ఉందనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. బిల్డర్ల నుంచి భారీగా ముడుపులు దండుకుని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ నిర్మాణాలను అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే గుసగుసలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అనుమతి ఒకటైతే, నిర్మాణం మరోలా జరుగుతున్నా తనిఖీ చేయాల్సిన అధికారులు మౌనం వహించడం అనేక సందేహాలకు తావిస్తోంది. ఈ నిర్మాణాలకు అతి సమీపంలోనే హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళుతోంది. విద్యుత్ నిబంధనల ప్రకారం హైటెన్షన్ వైర్లకు, భవనాలకు మధ్య కనీస సురక్షిత దూరం కచ్చితంగా పాటించాలి. కానీ ఇక్కడ ఆ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారు.



భవిష్యత్తులో ఈ హైటెన్షన్ లైన్ల వల్ల పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ కాసుల కక్కుర్తికి పోయి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వర్షాకాలంలో లేదా అనుకోని ప్రమాదాలు సంభవించిన ప్పుడు ఈ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనల మధ్య గడపాల్సి వస్తోంది.

హైటెన్షన్ వైర్లకు అత్యంత సమీపంలో ఐదు అంతస్తుల భవనాలు ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్లు, విద్యుత్ అపఘా తాలు జరిగే ముప్పు చాలా ఎక్కువ. కేవలం కొన్ని కుటుంబాలకు సరిపడేలా రూపొందించిన డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వ్యవస్థపై ఈ భారీ అక్రమ కట్టడాల వల్ల తీవ్ర అదనపు భారం పడుతుంది. ఫలితంగా ఆ ప్రాంతం అంతటా మౌలిక వసతుల కొరత ఏర్పడుతుంది. ఇరుకు రోడ్లు ఉండే ఈ కాలనీలలో భారీ భవనాల వల్ల వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తి, సాధారణ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. సర్కిల్–51 అధికారులు వెంటనే స్పందించి, భాగ్యనగర్ ఫేజ్ 3 లోని ఆయా ప్లాట్లలో జరుగుతున్న నిర్మాణాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనుమతికి మించి అక్రమంగా నిర్మించిన అంతస్తులను వెంటనే తొలగించాలని, నిబంధనలను ఉల్లంఘించిన బిల్డర్లపై, అక్రమాలకు సహకరించిన అధికారులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, హైటెన్షన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

ప్రజాధనాన్ని, పౌరుల ప్రాణాలను రక్షించాల్సిన అధికారులే మామూళ్ల మత్తులో జోగితే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కేదార్‌నాథ్‌లో విరిగిపడిన కొండచరియలు..

**- ట్రాఫిక్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులు**

**ముద్ర, న్యూఢిల్లీ :** కేదార్‌నాథ్ సమీపంలోని గౌరీకుండ్ వద్ద కొండ చరియలు విరిగి పడ్డాయి. రోడ్డుకు అడ్డంగా పెద్ద ఎత్తున మట్టి పెళ్లలు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 10వేల మందికిపైగా యాత్రికులు అక్కడ చిక్కుకు న్నట్లు సమాచారం. వారిలో 40 మంది తెలుగు యాత్రికులు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు హైదరాబాద్ నుంచి వెళ్లిన వారు కూడా ఉన్నారు. చిక్కుకున్న వారిలో తూర్పు గోదావరి జిల్లా రాయవరానికి చెందిన పీవీ కృష్ణారెడ్డి ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వాహనాల్లోనే వేచి చూస్తున్నట్లు ఆయన తెలిపారు.

## హైదరాబాద్‌లోని ఈ 11 ప్రముఖ రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అథారిటీ (TG SAFE) అధికారులు విస్తృత స్థాయి ఆకస్మిక దాడులు నిర్వహించారు. నాణ్యత, పరిశుభ్రత నిబంధనలు పాటించకుండా వినియోగదారులకు కల్తీ, నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారన్న ఫిర్యాదులతో 10 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలడంతో 11 ప్రముఖ రెస్టారెంట్ల FSSAI లైసెన్సులను అధికారులు రద్దు చేశారు.

అలాగే నిబంధనలు ఉల్లంఘించిన '63 డిగ్రీస్ మోడర్న్ రీజినల్ బఫెట్' (గచ్చిబౌలి), మినర్వా గ్రాండ్ (కొండాపూర్), హోటల్ అవాసా (హైటెక్ సిటీ) హోటళ్లకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల సమయంలో పలు హోటళ్ల వంటశాలల్లో బొద్దింకలు, ఎలుకల సంచారం ఉండటం, బూజు పట్టిన కూరగాయలు ఉపయోగించడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం లాంటి విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. పక్వాన్ గ్రాండ్‌లో ఏకంగా 1,170 కేజీల గడువు తీరిన బియ్యాన్ని అధికారులు గుర్తించారు. దీనికి తోడు వంట చేసే సిబ్బంది ఏమాత్రం వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడాన్ని తప్పుపట్టారు. దాడుల సందర్భంగా మొత్తం 21 ఆహార నమూనాలను సేకరించిన అధికారులు, వాటిని సమగ్ర విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపించారు.

# గాంధీజీ సమాధి పట్ల ఇంత నిర్లక్ష్యమా?







**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** జాతిపిత మహాత్మా గాంధీ అంటే మన దేశ పౌరులకే కాదు, అంతర్జాతీయంగా ఆయనకు ఎనలేని గౌరవం ఉన్నది. గాంధీజీ జయంతి రోజు విదేశాల్లో అధికారికంగా సెలవు ప్రకటించి ఆయన జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు . అలాంటి మహాత్ముని మనం ఇంకెంత గౌరవించాలి. రాజకీయ నాయకుల, అధికారుల నిర్లక్ష్యంతో గాంధీజీ పట్ల ప్రేమ తేటతెలమవుతుంది. స్వాతంత్ర సమరయోధురాలు జ్ఞాన కుమారి హెడే పట్టుదలతో దక్షిణ భారతదేశంలో ఏకైక గాంధీ సమాధి అది కూడా నగరంలోని లంగర్ హౌస్ లో ఉంది. గాంధీ జయంతి వర్ధంతి లకు మాత్రమే అధికారులు ఇక్కడ హడావుడి చేస్తున్నారు. మిగతా రోజుల్లో ఈ ప్రాంతం చెత్తాచెదారం, మందు సీసాలు ఆకతాయిలతో నిండి ఉంటుంది. బాపు ఘాటును అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తానని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి అయితే కనీసం సమాధిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని గాంధీయవాదులు కోరుతున్నారు.

**దక్షిణ భారతదేశంలో ఏకైక సమాధి.....**

ఆయన అస్తికలు ఇక్కడ నిమజ్జనం చేయగా, అప్పటి యూత్ కాంగ్రెస్ నాయకులు వి హనుమంతరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు బోయినపల్లి వెంకటరమణ ఇక్కడ గాంధీ సమాధిని నిర్మించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎక్కడ బాపు ఘాటును అభివృద్ధి చేశారు. ఇలాంటి సమాధిని పవిత్ర ఆలయంగా భావిస్తూ ఇక్కడికి చెప్పులు కూడా వేసుకొని వెళ్లరు. ఇలాంటి పవిత్రమైన ప్రాంతంలో నిత్యం మురుగు చెత్త కనిపిస్తుంది.

**అధికారుల నిర్లక్ష్యం...**

బాపు ఘాట్, గాంధీ సమాధిలను పర్యవేక్షించడంలో అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. జిహెచ్ఎంసి అధికారులు ఈ ప్రాంతం తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉందని తాము ఇక్కడ నిత్యం శుభ్రం చేయలేమని అంటున్నారు.

పర్యాటకశాఖ అధికారులు మాత్రం బాపు ఘాట్ ను ప్రైవేటు సంస్థకు అప్పగించామని వారితో పాటు జిహెచ్ఎంసి వారే పప్పు సమాధిని కాపాడు తారని చెబుతున్నారు. ఇలా తమ పరిధి కాదు అంటే తమ పరిధి కాదు అని బాపు సమాధిని నిర్లక్ష్యంగా వదిలేశారు.

**అధికారుల జాడ లేదు....**

సంవత్సరంలో రెండుసార్లు గాంధీ జయంతి గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్తో పాటు ముఖ్యమంత్రి ప్రముఖులు లంగర్ హౌస్ కు వచ్చి గాంధీజీకి నివాళులు అర్పిస్తారు. అయితే ఈ సందర్భాల్లోనే అధికారులు పట్టించుకోని గతంలో గాంధీ జయంతికి 15 రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేసేవారు. ఇందులో భాగంగా కలెక్టర్ 15 రోజుల ముందు అన్ని శాఖల అధికారులతో పర్యటించి ఏర్పాట్ల కోసం సమావేశం నిర్వహించేవారు.

అనంతరం ఆర్డిఓ మరోసారి పర్యటించగా, ఇంకోసారి కలెక్టర్ వచ్చి ఏర్పాట్లను చూసేవా రు. ప్రస్తుతం గాంధీ జయంతికి ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటివరకు ఇక్కడ అధికారుల పర్యటన లేకపోవడం తో పాటు కనీసం ఏర్పాట్లు కూడా ప్రారంభించకపోవడం సిగ్గుచేటు అని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గాంధీ సమాధిని నిత్యం శుభ్రంగా ఉంచుతూ, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు

## కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న వరుణ్ తేజ్



**ముద్ర, మల్యాల:** సినీ నటుడు వరుణ్ తేజ్ ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో అంజనారెడ్డి ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. వరుణ్ తేజ్ తిరుగు ప్రయాణంలో జనసేన కార్యకర్తలతో ముచ్చటించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఆయన వెంట కొండగట్టు పాలకవర్గం మాజీ సభ్యుడు కనపర్తి రవి, హాస్య నటుడు సత్య ఉన్నారు.

### పత్రికా ప్రకటన

**పాస్ పోర్ట్ పోయినది విషయం : నేను బోయినీ సంజీవ్ తండ్రి పేరు బోయినీ కొమురయ్య నివాసం ఇంటి నంబర్ 8-45 అంబేద్కర్ నగర్ , నవాబుపేట్ గ్రామం,చిగురుమామిడి మండలం, కరీంనగర్ జిల్లా నివాసిని విషయం**

**ఏమనగా** : నా యొక్క పాస్ పోర్టు నంబర్ G.O 773066 ఈ పాస్ పోర్ట్ తేదీ 20–08–2026 నాడు నవాబుపేట్, సుందరగిరి నుండి చిన్నములుకనూరు వెళ్ళే దారిలో నా వద్ద నుండి పోయినది/ తప్పిపోయింది. ఎంత వెతికిన పాస్ పోర్టు నాకు దొరకలేదు కావున ఎవరికైనా నా పాస్ పోర్టు దొరికిన యెడల నా చిరునామాలో అందించవలసినదిగా నా మనవి. లేదా స్థానిక పోలీసు స్టేషన్ లో అయిన ఇవ్వగలరు అని కోరుతున్నాను. ఒక వేళ పాస్ పోర్టు దొరికితే ఇవ్వకుండా దాని నీ ఏదైనా అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగించినట్లు ఐతే చట్ట రీత్యా శిక్షారులు అవుతారని విన్నవిస్తున్నాను. 9701203035 లేదా ఈ నంబర్ కి సమాచారం ఇవ్వగలరని మనవి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 28.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# నిద్రలో కలవరింత

## బయటపడండిలా?

సాధారణంగా నిద్రలో ఉన్నప్పుడు కొందరు కలవరిస్తారు. వారికి తెలియకుండానే నిద్రలో మాట్లాడటం, గట్టిగా అరవడం వంటి చేస్తుంటారు. నిజ జీవితంలో ఎలా ఇతరులతో మాట్లాడుతారో.. అలానే నిద్రలో కూడా కలవరిస్తుంటారు. ముఖ్యంగా రోజులో ఏ విషయం గురించి ఎక్కువ మాట్లాడుతారో దాని గురించే కలవరిస్తుంటారు. ఇలా కలవరిస్తున్నట్లు మనకి తెలియదు. కానీ మన పక్కన ఉన్న వాళ్లకి అయితే తెలుస్తుంది. నిద్ర నుంచి బయటకు వచ్చిన కూడా కలవరించినట్లు తెలియదు.

అయితే పిల్లలు ఎక్కువగా నిద్రలో కలవరిస్తారు. రోజంతా ఆడుకోవడం వంటి వాటి వల్ల పిల్లలు కలవరిస్తారు. అవంటి వాటి వల్ల కొందరు కలలో కలవరపడుతుంటారని నిపుణులు అంటున్నారు. పిల్లలు ఎక్కువగా ఇతరులతో ఆడుతుంటారు. ఇలాంటి సమయాల్లో వారు కొన్ని విషయాలకు భయపడటం వంటివి చేస్తుంటారు. వీటి వల్ల వారికి తెలియకుండానే నిద్రలో కలవరిస్తుంటారు. అలాగే పిల్లలకు సరైన నిద్ర లేకపోవడం, అధిక జ్వరం వంటి సమయాల్లో కూడా కలవరిస్తారు. కొందరు బాగా అలసిపోయినప్పుడు, డిప్రెషన్‌లోకి వెళ్లడం వల్ల నిద్రలో కలవరింతలు వస్తాయని నిపుణులు అంటున్నారు.

నిద్రలో కలవరింత సమస్య నుంచి విముక్తి చెందాలంటే మాత్రం వెంటనే వైద్యుని సంప్రదించాలి. కలవరింత ఏం కాదని లైట్ తీసుకోకుడదని నిపు



ణులు అంటున్నారు. అయితే ఎప్పుడో ఒకసారి కలవరిస్తే పర్లేదు. కానీ రోజూ ఇలానే నిద్రలో కలవరిస్తే మాత్రం లైట్ తీసుకోవద్దని నిపుణులు అంటున్నారు. అసలు నిద్రలో ఎందుకు కలవరిస్తారు? దీనికి గల కారణాలు ఏంటి? దీని నుంచి బయటపడటం ఎలాగో ఈస్టోరీలో తెలుసుకుందాం.

మీకు తెలియకుండా నిద్రలో కలవరించడాన్ని సోమ్నీ లోక్వి అంటారు. అయితే ఇది అందరిలో ఉండదు. కేవలం కొందరిలో మాత్రమే కనిపిస్తుంది. ఎక్కువగా మూడు నుంచి పదేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు మాత్రమే కనిపిస్తుంది. సాధారణంగా పిల్లలు నిద్రలో మాట్లాడతారు. కానీ అది ఎక్కువగా జరిగితే మాత్రం తప్పకుండా వైద్యని సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే నిద్రలో కలవరించడానికి చాలానే కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా పీడకలలు, ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు ఇలు అంటున్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే బాడీకి సరిపడా నిద్రపోవాలి. అలాగే ఒత్తిడి, ఆందోళనకు దూరంగా ఉండాలి. చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి, టెన్షన్ తీసుకోకూడదు. మెడిటేషన్, యోగా వంటివి చేస్తుండాలి. దేని గురించి పగలంతా ఎక్కువగా ఆలోచిస్తారో.. రాత్రి సమయాల్లో కలవరిస్తారు. కాబట్టి ఎక్కువగా ఏ విషయం గురించి ఆలోచించవద్దు. పూర్తిగా నిద్రకు దూరంగా ఉండకుండా బాడీకి సరిపడా నిద్రపోయేలా ప్లాన్ చేసుకోండి. రోజుకి తప్పకుండా 8 గంటలు నిద్రపోండి. అప్పుడే మీకు ఎలాంటి కలవరింతలు నిద్రలో రావు. నిద్రలేమి సమస్య ఉన్నా కూడా ఇది ఎక్కువ అవుతంది. ఇలా ఎన్ని నియమాలు పాటించిన కూడా సమస్య పరిష్కారం కాలేదంటే.. మాత్రం వెంటనే వైద్యుని సంప్రదించాలి. ఏం కాదులే అని లైట్ తీసుకున్నారో.. ఇక అంతే సంగతులు.

# ఓపెన్ జిమ్‌లతో ఆరోగ్యభాగ్యం

ఇంటికి దగ్గర్లోనే పార్క్ ఉంది.. అందులోనే ఓపెన్ జిమ్ ఉంది. మరి ఫిట్‌నెస్ కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరమేంటి? పరికరాలను సరిగ్గా ఉపయోగించడం తెలుసుకుని, శరీర సామర్థ్యానికి తగ్గట్టుగా క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వాకింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌కూ సమయం కేటాయించినట్టే. పార్కులో ఉండే రంగురంగుల వ్యాయామ పరికరాలను చూస్తూ వెళ్లిపోకుండా.. ఉపయోగించడం మొదలుపెడితే ఫిట్‌నెస్ సెషన్‌గా మార్చుకోవచ్చు. కాలనీలు, అపార్ట్‌మెంట్ ప్రాంగణాలు, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు పెరుగుతున్నాయి. ఇంటికి దగ్గర్లోనే.. అదీ ఉచితంగా.. పచ్చని ప్రకృతి మధ్యలో వ్యాయామం చేసుకోవచ్చు. పనిగట్టుకుని వెళ్లడం, రూ.వేల ఫీజులు కట్టాల్సిన అవసరం ఇందులో ఉండదు. అన్ని వయసుల వారూ వీటిని ఉపయోగించొచ్చు.



**ప్రయోజనాలు వేర్వేరు**

నగర పాలక సంస్థలతో పాటు జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటవుతున్నాయి. అయితే ఓపెన్ జిమ్‌లో కనిపించే ప్రతి పరికరం ఒకే రకమైన వ్యాయామం కోసం కాదు. కొన్ని పరికరాలు చేతులు, భుజాలు, ఛాతీకి ఉపయోగపడితే.. మరికొన్ని కాళ్లు, హిప్స్, నడుము, పొట్ట కండరాలకు పనిచేస్తాయి. మరికొన్ని తేలిక పాటి కార్డియో వ్యాయామానికి ఉపయోగపడతాయి.

దానం నాగేందర్‌పై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన సంచలనాత్మక తీర్పు, తెలంగాణ రాజకీయ యవనికపై మరోసారి ఉప ఎన్నికల నగారాను మోగించింది. ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి గెలిచిన ప్రజాప్రతినిధి, ఆ నియోజకవర్గ ప్రజల తీర్పును తృణప్రాయంగా భావించి, అధికారంలోకి వచ్చిన వేరొక పార్టీ కండువా కప్పుకోవడంపై న్యాయస్థానం కఠినంగా స్పందించడాన్ని ప్రజాస్వామ్యవాదులు స్వాగతిస్తున్నారు.

# కోర్టు తీర్పులతో

# మారని నేతలు!

## రాజకీయ 'ద్వంద్వ నీతి'.. ప్రజాస్వామ్యానికి చేటు!

రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా తగిన శాస్తి జరిగిందని విపక్షాలు హర్షం వ్యక్తం చేస్తూ 'న్యాయం గెలిచింది' అని ప్రకటించుకుంటున్నాయి. అయితే, ఈ న్యాయపోరాటాలు, కోర్టు తీర్పులు, పార్టీల సవాళ్లు–ప్రతిసవాళ్ల ముసుగులో అసలు ప్రశ్న ఒకటి నలిగిపోతోంది. నిరంతరం ముంచుకొచ్చే ఈ అనవసర ఉప ఎన్నికల వల్ల సగటు పౌరుడికి, ఆ నియోజకవర్గ అభివృద్ధికి నిజంగా ఒరిగేదేమిటి? ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట సాగే ఈ రాజకీయ క్రీడ అంతిమంగా సామాన్య పన్ను చెల్లింపుదారుల సొత్తును, ప్రభుత్వ యంత్రాంగ సమయాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేస్తోందనేది పచ్చి నిజం.

ఒక పార్టీ గుర్తుపై, నిర్దిష్టమైన మేనిఫెస్టోను చూపి ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగి గెలిచిన ప్రజాప్రతినిధులు.. ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే నిరాటంకంగా అధికార పార్టీ వైపు దూకేయడం మన రాజకీయ వ్యవస్థలో ఒక నిత్యకృత్యంగా, అనివార్యమైన ఆచారంగా మారిపోయింది. గతంలో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) అధికారంలో ఉన్న సమయంలో, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, టిడిపి తరపున గెలిచిన పదుల సంఖ్యలోని ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి ఆహ్వానించి, విలీనం పేరిట గుర్తింపు ఇచ్చినప్పుడు లేని పట్టింపులు, నైతిక నీతులు ఇవాళ హఠాత్తుగా ప్రత్యక్షం కావడం విడ్డూరంగా ఉంది. అప్పట్లో బీఆర్ఎస్ చేసిన పనినే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరావృతం చేస్తూ విపక్ష ఎమ్మెల్యేలకు కండువాలు కప్పే సంస్కృతిని కొనసాగించింది. "మా వద్దకు ఎమ్మెల్యేలు వస్తే అది రాజకీయం.. మీ వద్దకు వస్తే నేరం, రాజ్యాంగ ఉల్లంఘన" అన్నట్లుగా సాగుతున్న ఈ డబుల్ స్టాండర్డ్స్ చూస్తుంటే, రాజకీయ పార్టీలకు సిద్ధాంతాలు, నైతిక విలువలు కేవలం మైకుల ముందు మాట్లాడే ప్రసంగాలకే పరిమితమని వేరే చెప్పనక్కర్లేదు.

ఇక్కడ గమనించాల్సిన మరో తీవ్రమైన అంశం ఏమిటంటే.. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపు నిరోధక చట్టం) ఆంతర్యాన్ని దారుణంగా తుంగలో తొక్కడమే పనిగా పెట్టుకున్నాయి. జాతీయ స్థాయిలో స్వచ్ఛమైన రాజకీయం, రాజ్యాంగ పరిరక్షణ గురించి సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చే బిజెపి నాయకత్వం కూడా ఈ విషయంలో మినహాయింపేమీ కాదు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకొని, వ్యూహాత్మకంగా జిమ్మిక్కులు చేస్తూ ప్రభుత్వాలను కూల్చిన, ఏర్పరిచిన చరిత్ర నుండి బిజెపి తప్పించుకోలేదు. స్వతంత్రంగా అధికారం చేపట్టే బలం లేనప్పుడు ఇతర పార్టీలను చీల్చడం జాతీయ స్థాయిలో నిత్యకృత్యమైంది. అలాగే నేడు తెలంగాణలో కేసిఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు నైతికతల గురించి, న్యాయస్థానాల తీర్పుల గురించి పదే పదే మాట్లాడుతుంటే.. పదేళ్ల తమ పాలనా కాలంలో వారు ప్రతిపక్షాలను పూర్తిగా ఖాళీ చేయడానికి చేసిన ప్రయత్నాలు, విలీనాల పేరిట చేసిన రచ్చ ప్రజల మనోఫలకాలపై పదిలంగానే ఉన్నాయనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి.

ఈ రకమైన రాజకీయ వికృత క్రీడలో శాసన సభ స్పీకర్లు ఏళ్ల తరబడి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేసే ధోరణికి చెక్ పెడుతూ, రాజ్యాంగ పవిత్రతను కాపాడేందుకు న్యాయస్థానాలు కఠినమైన ఆదేశాలు ఇవ్వడం అత్యంత ఆహ్వానించదగిన పరిణామమే. కోర్టు గత ప్రభుత్వాల వైఖరిని లేదా ప్రస్తుత ప్రభుత్వాల వ్యూహాలను పక్కనబెట్టి, కేవలం రాజ్యాంగ చట్రానికి లోబడి తీర్పు ఇవ్వాల్సిన బాధ్యతను నెరవేర్చింది. కానీ, ఈ ప్రక్రియ వల్ల ప్రజాస్వామ్య మూలాలకే ప్రమాదం వాటిల్లుతోంది. ఓటు వేసి ఐదేళ్ల కాలానికి ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా అసెంబ్లీకి పంపితే, సదరు వ్యక్తి తన వ్యక్తిగత రాజకీయ స్వార్థాల కోసం, పదవుల వ్యామోహంతో, లేదా అధికార రక్షణ కోసం పార్టీలు మారిపోవడం ఎంతవరకు సమంజసం? ఆపై రాజీనామాలు చేయకుండా కోర్టుల చుట్టూ తిరుగుతూ, చివరికి అనర్హత వేటు పడ్డాక ఉప ఎన్నికలను ప్రజలపై రుద్దడం ఏ రకమైన న్యాయం?




- వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ 9848559863

ఉప ఎన్నికలు అంటే కేవలం ఒక రోజు ఓటింగ్ మాత్రమే కాదు. సుదీర్ఘ కాలం పాటు అమలులో ఉండే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోతాయి. ప్రభుత్వ యంత్రాంగమంతా పరిపాలనను పక్కన బెట్టి ఎన్నికల విధుల్లో మునిగిపోతుంది. ప్రచారాల పేరిట కోట్లాది రూపాయల నల్లధనం నీళ్లలా ఖర్చు అవుతుంది. ఈ అనవసరమైన రాజకీయ విలాసానికి అయ్యే ఖర్చు, పరిపాలనా స్తబ్దత వల్ల కలిగే నష్టం అంతిమంగా సామాన్య పన్ను చెల్లింపుదారుడి నెత్తినే పడుతోంది.

కాబట్టి, ప్రజాస్వామ్యంలో రావాల్సిన నిజమైన మార్పు కేవలం న్యాయస్థానాల అనర్హత తీర్పులతోనో లేదా ఒకరిపై ఒకరు చేసుకునే రాజకీయ విమర్శలతోనో సాధ్యపడదు. పొలిటికల్ పార్టీల మూల వైఖరిలోనే సమూలమైన మార్పు రావలసి ఉంది. ఒకవేళ ఏ ప్రజాప్రతినిధికైనా తాను గెలిచిన పార్టీ సిద్ధాంతాలు నచ్చక, వేరే పార్టీలోకి మారాలనుకుంటే.. ప్రాథమికంగా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాతే కొత్త పార్టీ కండువా కప్పుకొని మళ్లీ ప్రజల తీర్పును కోరే నికార్సైన సంస్కృతి పెరగాలి. అలా కాకుండా, రాజ్యాంగ వ్యవస్థల్లోని సందుగొందులను వెతుక్కుంటూ పదవులను కాపాడుకునే ప్రయత్నం చేయడం, ఫిరాయింపుదారులను ప్రోత్సహించే అధికార పిపాసను ప్రదర్శించడం ఆగిపోవాలి.

తీర్పులు వచ్చినప్పుడల్లా 'న్యాయం గెలిచింది' అని విపక్షాలు సంబరాలు చేసుకోవడం, 'రాజకీయ కుట్ర' అని అధికార పక్షాలు సానుభూతి వ్యక్తంచేయడం వంటి నాటకాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులు చేసుకొని, తమ స్వార్థం కోసం నియోజకవర్గాలను, ప్రజలను ఉప ఎన్నికల రొంపిలోకి నెట్టే ఈ దురాచారానికి స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైంది. రాజ్యాంగాన్ని మభ్యపెట్టే నాయకులకు, పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలే తమ మహత్తరమైన ఓటు అనే ఆయుధంతో సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పి, గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చలి నుంచి విముక్తి

## ఈ థర్మల్ వేర్ క్లాత్స్

చలికాలం వచ్చేసింది. ప్రస్తుతం అన్ని చోట్ల చలి తీవ్రత పెరిగిపోయింది. బయట వాతావరణంలోనే కాకుండా ఇంట్లో ఉన్నా కూడా చలి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఉష్ణోగ్రతలు కూడా చాలా తక్కువ అయ్యాయి. ఏ సమయంలో బయటకు వెళ్లిన కూడా చల్లని గాలులు వీస్తాయి. ఈ చలి వల్ల చాలా మందికి జలుబు, దగ్గు వంటివి వ



స్తున్నాయి. అలా అని బయటకు వెళ్లకుండా ఉండలేం. ఎందుకంటే ఏదో ఒక పని ఉంటుంది. పిల్లలు అయితే స్కూళ్లకు, ఉద్యోగాలు చేసే వారు ఆఫీసులకు ఇలా వెళ్తూనే ఉంటారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోయిన ఎంత చలి ఉన్నా కూడా వెళ్లడం మానరు. ఈ చలిలో ఎక్కువగా తిరిగితే దగ్గు, జలుబు వంటివి కూడా వస్తుంటాయి. సీజనల్‌గా వచ్చే ఈ సమస్యలు కూడా వస్తాయి. ఎంత స్వెటర్లు, రగ్గులు కప్పుకున్న కూడా చలి తీవ్రతను తట్టుకోవడం చాలా కష్టం. అయితే చలి నుంచి విముక్తి చెందాలంటే థర్మల్ వేర్ క్లాత్‌లను ధరించాలని నిపుణులు చెబుతున్నారు. మరి వీటివల్ల ఎలా చలి నుంచి విముక్తి పొందవచ్చు? ఈ థర్మల్ వేర్ క్లాత్‌ల వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో చూద్దాం.

థర్మల్ వేర్ క్లాత్‌లో లోదుస్తులు ఉంటాయి. వీటిని ధరించడం వల్ల శరీరానికి వేడి తగులుతుంది. మీరు దుస్తులు ధరించే ముందు ఈ థర్మల్ వేర్‌లో దుస్తులను ధరించాలి. ఆపై దుస్తులు వేసుకుంటే వెచ్చగా ఉంటుంది. శీతాకాలంలో ఈ థర్మల్‌లో దుస్తులు చలి నుంచి బాగా విముక్తిని కలిగిస్తాయి. చల్లగా ఉండే వాతావరణంలో వీటిని ధరించడం వల్ల మీ బాడీ ఎంతో వెచ్చగా ఉంటుంది. ఎలాంటి చల్లదనం తగలకుండా జలుబు, దగ్గు వంటివి కూడా రావు. ఇవి చాలా మృదువుగా ఉంటాయి. వీటిని ధరించడం వల్ల ఎలాంటి చర్మ సమస్యలు కూడా రావు. ఎంత తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నా కూడా మీ బాడీ వెచ్చగా ఉంటుంది. ఇవి ధరించడానికి చాలా తేలికగా ఉంటాయి. అలాగే సౌకర్యంగా కూడా ఉంటాయి. అలాగే శ్వాసక్రియ కూడా బాగా జరిగేలా చేస్తుంది. వీటిలో టాప్, ప్యాంట్ ఇలా అన్ని ఉంటాయి. వీటిని లోదుస్తులు ధరించిన తర్వాత వేసుకుని, ఆపై దుస్తులు వేసుకుంటే మీ బాడీ వెచ్చగా ఉంటుంది. థర్మల్ క్లాత్‌లు చల్లదనాన్ని తగ్గించి వేడిని ఇస్తాయి.

చలికాలంలో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. చలి తీవ్రత పెరిగే కొలది సమస్యలు వస్తాయి. కాబట్టి శరీరానికి వెచ్చగా ఉండే దుస్తులు మాత్రమే ధరించాలి. ఈ కాలంలో చల్లని నీరు కాకుండా కేవలం వేడి నీటికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో చల్లని నీరు తాగడం, స్నానం చేయడం వల్ల ఇంకా సమస్యలు ఎక్కువ అవుతాయి. కాబట్టి వేడి నీరు తాగడం, స్నానం చేయడం అలవాటు చేసుకోవాలి. చల్లగా ఉన్నప్పుడు బయట తిరగవద్దు. అలాగే ఉదయం, రాత్రి వేళలో అసలు బయటకు వెళ్లవద్దు. ఉదయం 8 గంటల వరకు బయటకు రాకుండా ఉండండి. వ్యాయామం చేయాలంటే మాత్రం 8 తర్వాతే చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అంతకంటే ముందు వెళ్లే మంచు వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది .




## ఈ మసాలా దినుసులతో..

# కొలెస్ట్రాల్‌కు చెక్

మన వంట గదిలో ఉన్న కొన్ని పదార్థాలతో అనారోగ్య సమస్యలను క్లియర్ చేసుకోవచ్చు. ముఖ్యంగా వంటగదిలో ఉండే దినుసులతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అందరి వంటింట్లో సాధారణంగా ధనియాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. వీటిని ఎక్కువగా వంటల్లో ఉపయోగిస్తారు. మసాలాలు తయారు చేయడానికి, చికెన్, మటన్ వంటి మసాలా కూరల్లోకి వండుతారు. ఈ ధనియాలతోనే కొత్తమీర విత్తనాలు కూడా వేస్తారు. వీటివల్లే కొత్తమీర అవుతుంది. అయితే వీటిని కేవలం వంటల్లోనే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలకు కూడా ఉపయోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఇందులో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయని, వీటిని తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొందరు ఎక్కువ బరువుతో ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారు వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈజీగా బరువు తగ్గవచ్చు. ఈ ధనియాలతో నీరు తయారు చేసుకుని తాగితే కేవలం ఒక నెల రోజుల్లోనే ఈజీగా బరువు తగ్గుతారు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ధనియాల్లో విటమిన్ సీ, విటమిన్ బీ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, కాపర్, జింక్, సెలీనియం, మాంగనీస్, సోడియం కార్బోహైడ్రేట్ వంటి మూలకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి కల్పిస్తాయి.

ఇందులోని ఔషధ గుణాల వల్ల జీర్ణ సమస్యలను క్లియర్ చేస్తుంది. అలాగే అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. ఇందులో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అలర్జీ సమస్యలు అన్ని కూడా క్లియర్ అవుతాయి. కొందరు యూరిన్ ఇన్ఫెక్షన్ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారు ధనియాల గింజల వాటర్‌లో చక్కెర కలిపి తాగాలి. ఇలా చేస్తే యూరిన్ సమస్య క్లియర్ అవుతుంది. ధనియాల నీరు శీతలీకరణ ప్రభావాన్ని అందించడంతో పాటు మూత్రనాళంలో మంటను తొలగిస్తుంది. ధనియాల గింజలు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి ఆర్థరైటిస్ సమస్యను క్లియర్ చేస్తాయి. అలాగే వాపు సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కొందరు ఊబకాయం సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారు ధనియాల గింజల నీటిని డైలీ తాగడం వల్ల బాడీలో ఉన్న కొలెస్ట్రాల్ అంతా కూడా క్లియర్ అవుతుంది.

## అక్టోబరు 12 నుంచి తిరుమల శ్రీవారి

# నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**ముద్ర, తిరుమల:**

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు )అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం మూడేళ్లకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహనసేవ రాత్రి 6.30 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుంది.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

సోమవారం 28.09.2026

www.mudranews.in | @mudranews




**కడుపు ఉబ్బరం :** ఉప్పు తగ్గించండి అధికంగా ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండి పొట్ట ఉబ్బినట్లు అనిపించవచ్చు. కాబట్టి ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను పరిమితం చేయడం మంచిది.



# నెక్లెస్ రోడ్డుపై పరుగుల పండగ

**హుస్సేన్‌సాగర్ తీరాన**
**35 వేల మందితో పింక్ పవర్ రన్ 3.0**
**రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు కదలిన రన్నర్స్**
**మహిళల ఆరోగ్యం, ముందస్తు గుర్తింపుపై చైతన్యం**
**21కే హాఫ్ మారథాన్‌కు**
**పలు దేశాల నుంచి రన్నర్లు**
**రూ.75 లక్షల నగదు బహుమతులు**
**ప్రముఖులు, క్రీడాకారులు, సినీ తారలతో**
**ఉత్సాహభరితంగా మూడో ఎడిషన్**









**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబరు 27:** రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యంపై చైతన్యం, మహిళల ఆరోగ్య సంరక్షణ, సాధికారతకు మద్దతుగా హైదరాబాద్ పరుగులు తీసింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధా రెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'పింక్ పవర్ రన్ 3.0' కు ఆదివారం అపూర్వ స్పందన లభించింది. హుస్సేన్‌సాగర్ తీరంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ఈ మెగా కమ్యూనిటీ రన్‌లో దాదాపు 35 వేల మందికి పైగా పాల్గొన్నారు. తెల్లవారుజామునే నెక్లెస్‌రోడ్ పరిసరాలు రన్నర్లతో కిక్కిరిశాయి. ఆరోగ్యం, ఫిట్‌నెస్, ముందస్తు వైద్య పరీక్షలు, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో అతిపెద్ద కమ్యూనిటీ ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది.

### నాలుగు విభాగాల్లో పరుగులు

పింక్ పవర్ రన్‌లో నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల పరుగులు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదేళ్ల చిన్నారులతో పాటు 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం స్ఫూర్తిని చాటారు. అంతర్జాతీయ రన్నర్లతో హాఫ్ మారథాన్21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో స్పందన లభించింది. అమెరికా, ఇంగ్లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఉగాండా, శ్రీలంక, ఐస్‌లాండ్, టాంజానియా, బోట్స్వానా, కెన్యా, కెనడా తదితర దేశాల నుంచి రన్నర్లు పాల్గొన్నారు. దేశ, విదేశాలకు చెందిన రన్నర్లతో నెక్లెస్‌రోడ్డుపై అంతర్జాతీయ క్రీడా వాతావరణం నెలకొంది.

### ప్రముఖుల జెండా ఊపి ప్రారంభం

పింక్ పవర్ రన్‌ను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఎంఈఐఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి, సుధా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ (ఈవీ ట్రాన్స్) ఉపాధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. సినీ నటుడు సిద్దు జొన్నలగడ్డ, మాజీ ప్రపంచ సుందరి ఓపల్ సుచేత, భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ పునీత్, అవినాష్ గ్రూప్ సంస్థల చైర్మన్ అవినాష్ పాల్గొని రన్నర్లలో ఉత్సాహం నింపారు.

### రమాబాయి రాక.. స్ఫూర్తిదాయక కథ

పింక్ పవర్ రన్‌లో మహారాష్ట్రకు చెందిన రమాబాయి రణ్‌వీర్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీడ్ జిల్లా అంబాజోగైకి చెందిన 47 ఏళ్ల రమాబాయి.. తన పిల్లల చదువుల కోసం గతంలో చెప్పులు లేకుండా ఐదు కిలోమీటర్లు పరుగెత్తి వార్తల్లో నిలిచారు. ఆమె పింక్ పవర్ రన్‌లో పాల్గొనడం ద్వారా మహిళల పట్టుదల, ఆరోగ్యంపై అవగాహన, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.

### విజేతలకు రూ.75 లక్షల బహుమతులు

వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నిర్వాహకులు మొత్తం రూ.75 లక్షల విలువైన నగదు బహుమతులు అందించారు. నగదుతోపాటు మెడల్స్, ట్రోఫీలను నిర్వాహకులు, ముఖ్య అతిధులు అందజేశారు.21కే హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో సునీల్ కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా మహిళల విభాగంలో సోనమ్ విజేతగా నిలిచారు.10కే రన్ పురుషుల విభాగంలో హరీష్ షరీన్ తొలి స్థానాన్ని సాధించగా మహిళల విభాగంలో వందన పటేల్ విజేతగా నిలిచారు. 5కే రన్ పురుషుల విభాగంలో లవ్ చౌదరి మొదటి స్థానంలో మహిళల విభాగంలో అంజలి విజయం సాధించారు.

### ఆరోగ్యంపై చైతన్యం పెరగాలి: మంత్రి సీతక్క

ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సుధా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పింక్ పవర్ రన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

### ఆరోగ్యమే నిజమైన సంపద

ఎంఈఐఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవనశైలి వ్యాధులను నివారించేందుకు రోజువారీ వ్యాయామం ఎంతో అవసరమన్నారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి నిజమైన సంపద అన్నారు.

### హైదరాబాద్‌కు ఉత్తమ అనుభవం ఇవ్వాలన్నదే లక్ష్యం

సుధా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి మాట్లాడుతూ పింక్ పవర్ రన్ మూడో ఏడాదికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో పెరిగిన తమకు నగరానికి అత్యుత్తమ కార్యక్రమాలను అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. ఫిట్‌నెస్, ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఇక్కడి నుంచి తీసుకెళ్లే ఆరోగ్య స్ఫూర్తిని కుటుంబం, స్నేహితులు, సమాజంలోకి తీసుకెళ్లాలని కోరారు మాజీ ప్రపంచ సుందరి ఓపల్ సుచేత చువాంగ్‌స్రీ వరుసగా రెండోసారి పింక్ పవర్ రన్‌లో పాల్గొన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం మంచి లక్ష్యమన్నారు. 10కే, 5కే పరుగులను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహనపై తాను పనిచేస్తున్నందున ఈ కార్యక్రమం తనకు ప్రత్యేకమైనదని తెలిపారు.

### మహిళల సాధికారతకు వేదిక

భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ మాట్లాడుతూ.. మహిళలను ఒకచోట చేర్చి వారికి సాధికారత కల్పించే కార్యక్రమంగా పింక్ పవర్ రన్ నిలుస్తోందన్నారు. అద్భుతమైన వాతావరణం కనిపిస్తోందని.. అందరూ పరుగెత్తుతూ, నిరంతరం శ్రమిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మంచి కారణం కోసం మంచి కార్యక్రమం: సిద్దుసినీ నటుడు సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ పింక్ పవర్ రన్ ఎంతో మంచి కారణం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమమన్నారు.

### రన్నర్లలో ఉత్సాహం నింపిన థమన్ సంగీతం

ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ నిర్వహించిన ప్రత్యక్ష సంగీత కార్యక్రమం పింక్ పవర్ రన్‌కు మరింత ఉత్సాహాన్ని జోడించింది. రన్ పూర్తిచేసిన రన్నర్లు సంగీత కార్యక్రమాన్ని ఆస్వాదిస్తూ సందడి చేశారు. ప్రముఖులు సైతం రన్నర్లతో సెల్ఫీలు దిగుతూ వారిని అభినందించారు.

### 10కే పరుగులో లారా విలియమ్స్

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ స్వయంగా 10కే పరుగులో పాల్గొన్నారు. సుధా రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, ఓపల్ సుచేత తదితరులు 5కే, 10కే పరుగుల్లో పాల్గొని రన్నర్లతో కలిసి పరుగులు తీశారు. ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్య స్ఫూర్తిపింక్ పవర్ రన్ 3.0లో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, న్యూరోడైవర్జెంట్ వ్యక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతోపాటు ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయడంలో ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది.రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి సందేశాలను సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేయడమే లక్ష్యంగా పింక్ పవర్ రన్ ఉద్యమాన్ని మరింత విస్తరించేందుకు నిర్వాహకులు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి యాంకర్ సుమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## ఘనంగా భరత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం



**ముద్ర, కూకట్‌పల్లి:** భరత్‌నగర్ కాలనీ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవ వేడుకలను కాలనీ అధ్యక్షుడు పట్లోల్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కాలనీవాసులు తమ సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భరత్‌నగర్ కాలనీ సర్వాంగీణ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో అసోసియేషన్ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.ఆర్. నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఏ. రాజు, ట్రెజరర్ పి. నరేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కె. రాంబాబు గౌడ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి. వెంకటేష్, కె. పెదబాబు, డేవిడ్, లలిత, యాదవ్, అపర్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అశోక్, శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, నాగార్జున తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పంజాబ్ ఎల్‌పీయూలో ఆరని మంటలు



**ముద్ర, డెస్క్**
పంజాబ్‌లోని ఫగ్వారా లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఒక విద్యార్థినిపై యూనివర్సిటీ బయట వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా నిరసన చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. యూనివర్సిటీలోని కిటీల అద్దాలు పగలగొట్టడంతో పాటు కొన్ని వస్తువులకు నిప్పుపెట్టారు. ఆదివారం సాయంత్రం కూడా మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే, ఈ ఘర్షణలు విద్యార్థులు, పోలీసులకు మధ్య ఉద్రిక్తతలకు దారి తీశాయి. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయని జలంధర్ ఎస్ఎస్పీ హర్విందర్ సింగ్ విర్క్ తెలిపారు. పలు పోలీస్ వాహనాలు ధ్వంసమయ్యాయని, కొన్నింటికి నిప్పు పెట్టారని తెలుస్తోంది.ఈ ఉద్రిక్తతలు శనివారం రాత్రి నుంచే నెమ్మదిగా మొదలయ్యాయి. క్యాంపస్‌లో ఓ విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని, అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకుందంటూ సోషల్ మీడియాలో సమాచారం వ్యాపించింది. ఈ వార్తలతో భారీ సంఖ్యలో విద్యార్థులు బాలికల హాస్టల్ సమీపంలో గుమిగూడారు. ఈ ఘటనపై ఎలాంటి ఆధారాలు, ఫిర్యాదులు అందలేదని ముందుగా పోలీసులు చెప్పారు. యూనివర్సిటీ వర్గాలు కూడా ఈ ఘటనను తోసిపుచ్చాయి.ఇదిలా ఉంటే, ఆ తర్వాత పోలీసులు విద్యార్థిని వాంగ్మూలం తీసుకుని, కేసు నమోదు చేశారు. ఘటనపై సిట్ ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ డేటాను పరిశీలించనున్నట్లు జలంధర్ రేంజ్ డీఐజీ నవీన్ సింగ్లా తెలిపారు. ఈ దర్యాప్తులో విద్యార్థి ప్రతినిధుల్ని కూడా భాగస్వామ్యం చేస్తామని చెప్పారు.

## ఆ మీడియాలో కవితపై బ్యాన్..



### అసలు విషయం బయటపెట్టేసింది..

**ముద్ర, డెస్క్**
తెలంగాణ రాజకీయాల్లో సొంత దారిలో కొత్త పార్టీతో ముందుకు సాగుతున్న కల్వకుంట్ల కవిత చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. కేవలం రాజకీయంలోనే కాకుండా.. మీడియా వర్గాల్లోనూ ఇవి పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి చెందిన 'సాక్షి' మీడియా తన వార్తలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ కవిత చేసిన తీవ్ర ఆరోపణలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి.'సాక్షి'లో స్థానం లేకపోవడానికి ఆ బంధమే కారణమా? ఓ ప్రముఖ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత తన ఆవేదనను, ఆక్రోశాన్ని స్పష్టంగా వెళ్లగక్కారు. తాను కొత్త పార్టీని ప్రకటించినప్పటి నుంచి 'సాక్షి' మీడియా తనను పూర్తిగా పక్కన పెట్టేసిందని ఆరోపించారు. తాను చేసే ఏ ఒక్క ప్రకటననూ ప్రచురించడం లేదని కనీసం తన లైవ్ కార్యక్రమాలను కూడా ప్రసారం చేయడానికి నిరాకరిస్తోందని పేర్కొన్నారు.ఈ వైఖరి వెనుక అసలు రాజకీయ కారణాన్ని కూడా ఆమె బయటపెట్టారు. కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగానే తనకు 'సాక్షి'లో స్థానం దక్కకుండా పోతోందని ఆమె బాహాటంగానే విమర్శించారు. కేటీఆర్‌తో విభేదించి బయటకు వచ్చినందుకే జగన్ మీడియా తనను తొక్కేసే ప్రయత్నం చేస్తోందన్న కోణం ఈ వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోంది.డబ్బుతోనే సోషల్ మీడియా బలం గులాబీ పార్టీపై కవిత విమర్శలుబీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, సోషల్ మీడియా నెట్‌వర్క్‌పై కూడా కవిత కీలక సంచలన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ చాలా బలంగా కనిపిస్తున్నప్పటికీ అది క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ ప్రజాబలం కాదని కొట్టిపారేశారు. పార్టీ భారీగా నిధులు వెచ్చిస్తోంది కాబట్టే సోషల్ మీడియాలో అంత హంగామా కనిపిస్తోందని విమర్శించారు. గణపతి నిమజ్జనం వంటి బహిరంగ వేడుకల్లో కేసీఆర్‌కు అనుకూలం గా వచ్చే నినాదాలు, పాటల వెనుక కూడా భారీగా డబ్బుల ప్రభావం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా తాను బీఆర్ఎస్‌కు శాశ్వతంగా దూరమయ్యానని, మళ్లీ గులాబీ గూటికి వెళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పడం ద్వారా కల్వకుంట్ల కుటుంబంలో ఏర్పడిన రాజకీయం, వ్యక్తిగత పూడ్చలేని విభేదాలను ఆమె మరోసారి బహిర్గతం చేశారు. నాడు కుట్రలంటూ ఖండన.. నేడు అదే వేదికపై ఇంటర్వ్యూలుకవిత రాజకీయ ప్రయాణంలో వచ్చిన మార్పును విశ్లేషకులు ఆసక్తికరంగా గమనిస్తున్నారు. గతంలో కవిత బీఆర్ఎస్ వీడి కొత్త పార్టీ పెడతారంటూ కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేసినప్పుడు ఆమె తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆ వార్తలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. తనపై జరుగుతున్న కుట్రగా కొట్టిపారేశారు. అయితే కాలం మారడంతో రాజకీయ సమీకరణాలూ మారాయి. నాడు ఏ మీడియా సంస్థ కథనాలను అయితే ఆమె ఖండించారో.. నేడు అదే సంస్థ వేదికగా సుదీర్ఘ ఇంటర్వ్యూలు ఇవ్వడం, వారి పత్రికల్లో ప్రకటనలు ఇస్తుండటం గమనార్హం. దీంతో రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడికి అద్దం పడుతోంది. ఒక తెలంగాణ కీలక నేతగా, కొత్త పార్టీని స్థాపించి ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్న మహిళా నాయకురాలి వార్తలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై మీడియా వైఖరిపైనే కొత్త ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాజకీయ నాయకుల వ్యక్తిగత సత్సంబంధాలు, వ్యాపార–మీడియా ప్రయోజనాలను ప్రభావితం చేస్తున్నాయా అనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి. అయితే కవిత వ్యాఖ్యలు కేవలం ఒక రాజకీయ నాయకురాలిగా ఆమె చేసిన ఆరోపణలు మాత్రమేనని దీనిపై సదరు మీడియా సంస్థ వైఖరి ఏమిటనేది కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేటీఆర్, జగన్ బంధంపై కవిత చేసిన కామెంట్స్ రాబోయే రోజుల్లో పొలిటికల్ హీట్‌ను మరింత పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

# యుద్ధాలతో మోడీ నేర్చిన గొప్ప పాఠం

**ముద్ర, డెస్క్**
ప్రపంచ రాజకీయాలను, సైనిక వ్యూహాలను మార్చేసిన రెండు ఘటనలు ఇటీవల కాలంలో స్పష్టంగా కనిపించాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధం, అమెరికా–ఇజ్రాయెల్‌తో ఇరాన్ ఘర్షణ. ఈ రెండూ సంప్రదాయ యుద్ధ భావనలను తలకిందులు చేశాయి. గతంలో యుద్ధాలు వారాలు లేదా నెలల్లో ముగుస్తాయని అనుకున్నప్ప టికీ, ఇప్పుడు అవి సంవత్సరాల పాటు కొనసాగవచ్చని నిరూపితమైంది. ఇరాన్ ఏకకాలంలో అనేక ముందు వరుసల్లో పోరాడుతూ నాలుగు నెలలకుపైగా నిలబడటం ఇంకో ఉదాహరణ. ఈ పరిణామాలు భారత సైన్యానికి, పాలకులకు గొప్ప పాఠాలు నేర్పుతున్నాయి.

### ఆయుధ సరఫరా కీలకం..

దీర్ఘకాల యుద్ధంలో విజయం కేవలం ధైర్యం లేదా వ్యూహాలపైనే ఆధారపడదు. నిరంతరం ఆయుధాలు అందుబాటులో ఉండటమే కీలకం. రోజువారీ దాడులకు ఎంత పరిమాణంలో మందుగుండు, క్షిపణు లు, డ్రోన్లు అవసరమో లెక్కించుకోవాలి. స్టాక్‌లు తగ్గితే యుద్ధం కొనసాగడం కష్టం.

### ఆత్మనిర్భర్ వైపు...

భారత్ ఈ పాఠాలను గ్రహించి విదేశీ ఆయుధాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగాన్ని కూడా ప్రోత్సహిస్తోంది. వేగవంతమైన ఉత్పత్తికి ప్రైవేట్ పాల్గొనడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. దీని ఫలితంగా డ్రోన్ రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. వందలాది స్టార్టప్‌లు దాడి డ్రోన్లు, నిఘా డ్రోన్లు తయారు చేస్తున్నాయి. ఇజ్రాయెల్ సాంకేతిక సహకారంతో బెంగళూరు సంస్థలు తయారు చేసిన డ్రోన్లు ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో మెరుగైన ప్రదర్శన ఇచ్చాయి. ఇది స్వదేశీ సామర్థ్యం పెరుగుతున్నదని సూచిస్తోంది.

### బలమైన వ్యవస్థ..

కీలక ఆయుధాలు అగ్ని సిరీస్, బ్రహ్మోస్, సముద్ర ఆధారిత క్షిపణులు ప్రభుత్వ సంస్థల పరిధిలోనే ఉన్నాయి. అయితే ఆకాశ్ న్యూ జనరేషన్, అస్త్ర, నాగ్, ప్రళయ్ వంటి వ్యవస్థల్లో ప్రైవేట్ సంస్థల పాత్ర పెరుగుతోంది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, భుజాలపై మోసే క్షిపణులు కూడా ఈ భాగస్వామ్యంతో అభివృద్ధి చెందుతున్నాయి. దీని వల్ల డిఫెన్స్ ఉత్పత్తి వేగం పెరిగింది. అనేక కొత్త కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశిస్తున్నాయి. ఆత్మనిర్భర్ భారత్ కింద ఈ మార్పు మరింత బలపడుతోంది. రక్షణ పరిశోధన కూడా అవసరం. భారత్ ఇప్పటికే సరైన దిశలో అడుగులు వేస్తోంది. ప్రైవేట్–పబ్లిక్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తే, దీర్ఘకాల యుద్ధాల సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్




**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదవులు, రాజకీయ భవిష్యత్తు కంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకే బాపూజీ ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పోరాటం, త్యాగం, ప్రజాసేవకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సామాజిక అసమానతలు, వెట్టిచాకిరీ వంటి దోపిడీకి వ్యతిరేకంగా కూడా ఆయన పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన మహనీయుడిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.బాపూజీ ఆశయాలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ ఉద్యమ సమయంలో తాము ఎంపీలుగా ఉన్నప్పుడు ఎంతో ఆదర్శంగా నిలిచాయని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చేనేత కార్మికులు, నేతన్నల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.బలహీన వర్గాలు ఐక్యంగా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో ఐదుగురు పద్మశాలి ఎమ్మెల్యేలు గెలవాలని మంత్రి ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తుల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు చట్టం చేసిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపడతామని ప్రకటించినప్పటికీ, బీసీల వివరాలను కూడా సమగ్రంగా సేకరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు గూడూరి శ్రీనివాస్, అనిల్ ఈరవర్తి, మెట్టు సాయికుమార్, బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 28.09.2026
www.mudranews.in | @mudranews



### కడుపు ఉబ్బరం : మలబద్ధకాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మలబద్ధకం ఉన్నప్పుడు కడుపు ఉబ్బరం ఎక్కువగా కనిపించొచ్చు. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాల వంటి ఫైబర్ ఉన్న ఆహారాన్ని తగిన మోతాదులో తీసుకోవడం ఉపయోగకరం.



# ఏడాది గడిచినా న్యాయం దక్కలేదు



## లడఖ్ నిరీక్షణ ఎన్నాళ్ళు? సోనం వాంగ్చుక్ ఆవేదన భరిత స్వరం

**ముద్ర, లేహ్** : సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో నా మొదటి ఉదయం ప్రారంభమైంది. 2025 సెప్టెంబర్ 26న జాతీయ భద్రతా చట్టం (NSA) కింద నన్ను నిర్బంధించి, లడఖ్‌కు సుమారు 2,000 కిలోమీటర్ల దూరంలోని జోధ్‌పూర్‌కు తరలించారు. దాదాపు ఆరు నెలల పాటు నేను అక్కడ దాదాపు పూర్తిగా ఒంటరిగా నిర్బంధంలో ఉన్నాను.

నా నిర్బంధానికి కేవలం రెండు రోజుల ముందు, 2025 సెప్టెంబర్ 24న లడఖ్ ఒక చీకటి రోజును చూసింది. పోలీసుల కాల్పుల్లో నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు, ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పలువురు గాయపడ్డారు. ఇంకా అనేక మందిని అరెస్టు చేసి అత్యంత తీవ్రమైన నేరాల కింద కేసులు నమోదు చేశారు.

ఏడాది గడిచిపోయింది. అయితే ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మాత్రం కాలం గడిచినా ప్రశ్నలు సమసిపోలేదు. ఏదో ఒక విధంగా, మౌనం ఆ ప్రశ్నలను మరింత బిగ్గరగా వినిపిస్తోంది.

### న్యాయ విచారణ నివేదిక ఎక్కడ?

2025 సెప్టెంబర్ 24న జరిగిన ఘటనలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ బి.ఎస్. చౌహాన్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు ఏడాది గడిచినా లడఖ్ ప్రజలు ఇంకా ఆ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజలు సహజంగానే ప్రశ్నిస్తున్నారు. ఇంత ఆలస్యం ఎందుకు? విచారణలో ఏం తేలింది? కాల్పులకు ఆదేశించింది ఎవరు? కాల్పులు జరపాలని ఆదేశం ఉందా? ప్రత్యక్ష కాల్పులకు దిగే ముందు జన సమూహ నియంత్రణకు సంబంధించిన నిర్దేశిత అన్ని దశలను పూర్తిగా అమలు చేశారా? ప్రజల శరీరాల్లోని కీలక అవయవాలపై కాల్పులు ఎందుకు జరిగాయి? ఈ మరణాలను నివారించగలిగే అవకాశం ఉందా?

ఇవి పుకార్లు, ఆరోపణలు, పరస్పర ఆరోపణల ద్వారా సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు కావు. అందుకే న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కాబట్టి నివేదికను బయటకు తీసుకురావాలి. ప్రజలకు నిజం తెలియాలి. తప్పిదం లేదా అక్రమం జరిగినట్లు విచారణలో తేలితే, ఎంత ఉన్నత స్థాయి వ్యక్తి అయినా బాధ్యులను జవాబుదారీగా చేయాలి.

నివేదిక అందుబాటులోకి రాకుండా మరింత కాలం గడుస్తున్న కొద్దీ అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాస్తవాలను మరుగునపరుస్తున్నారేమో, బాధ్యులను కాపాడుతున్నారేమో అనే అనుమానాలు సామాన్య ప్రజల్లో పెరుగుతాయి. ప్రభుత్వం ఆ అనుమానాలను తొలగించడానికి ఉత్తమ మార్గం ఒక్కటే నిజాన్ని వెలుగులోకి తీసుకురావడం.

### బాధిత కుటుంబాలకు గౌరవప్రదమైన పరిహారం ఇవ్వాలి

కాల్పుల్లో మరణించిన నలుగురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం, గాయపడిన వారికి తక్కువ మొత్తాల్లో పరిహారాన్ని లడఖ్ పాలనా యంత్రాంగం ప్రకటించింది. ఒక తల్లికి తన కుమారుడిని, భార్యకు తన భర్తను, పిల్లలకు తమ తండ్రిని కోల్పోయిన బాధకు రూ.15 లక్షలు ఎప్పటికైనా పరిహారం కాగలవా? ఏ మొత్తమూ ఆ నష్టాన్ని భర్తీ చేయలేదు. అయితే పరిహారం అనేది జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తున్నదని, బాధిత పౌరుల పట్ల తన బాధ్యతను అంగీకరిస్తున్నదని తెలియజేసే మార్గం కూడా. అందుకే రూ.15 లక్షల మొత్తం చాలా తక్కువగా అనిపిస్తోంది. ఇది మరింత బాధాకరంగా అనిపించేది ఏమిటంటే, లడఖ్ కేంద్రపాలిత ప్రాంత పరిపాలన ఉత్సవాలు, వేడుకలు, ప్రజా కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేయగలుగుతోంది. కొన్ని సందర్భాల్లో లడఖ్‌లో నెలకు ఐదుకుపైగా పండుగలు, ఉత్సవాలు కూడా నిర్వహిస్తున్నారు. పండుగలకు వాటి స్థానం ఉంది. సంస్కృతిని తప్పకుండా జరుపుకోవాలి. కానీ వరుస వేడుకలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయగలిగినప్పుడు, సెప్టెంబర్ 24న జరిగిన విషాద ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన లేదా తీవ్రంగా గాయపడిన వారి కుటుంబాలను గౌరవంగా ఆదుకునేందుకు తగిన మొత్తాన్ని కేటాయించలేమా? అందువల్ల మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని గౌరవప్రదమైన స్థాయికి పెంచాలని, తీవ్రంగా లేదా శాశ్వతంగా గాయపడిన వారికి వారి బాధకు తగిన పరిహారం అందించాలని మేము కోరుతున్నాం.

జంతర్ మంతర్ నిరసన అనంతరం నా నిరాహార దీక్షను విరమింపజేసే సమయంలో NEET ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించిన కేసులతో ప్రభావితమైన కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీకి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలపై మాటలుగా మిగిలిపోకూడదు.

### 3. NSA కింద ఆరు నెలల నిర్బంధం.. మరి ఆ తర్వాత?

2025 సెప్టెంబర్ 26న భారతదేశంలోని అత్యంత కఠినమైన ముందస్తు నిర్బంధ చట్టాల్లో ఒకటైన జాతీయ భద్రతా చట్టం (NSA) కింద నన్ను నిర్బంధించి జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. దాదాపు ఆరు నెలలు అక్కడే ఉన్నాను. నా నిర్బంధాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్న సమయంలో, 2026 మార్చి 14న ప్రభుత్వం నిర్బంధ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. నేను స్వేచ్ఛగా బయటకు వచ్చాను. అందువల్ల నేను చాలా సాధారణమైన ఒక ప్రశ్న అడుగుతున్నాను. నేను జాతీయ భద్రతకు లేదా ప్రజా శాంతికి అంతటి ప్రమాదకారుడినైతే, నన్ను NSA కింద లడఖ్ నుంచి దూరంగా తీసుకెళ్లి నిర్బంధించాల్సిన అవసరం ఉందని భావిస్తే, మరి ఈ రోజు నేను స్వేచ్ఛగా ఎందుకు ఉన్నాను ఒకవేళ నేను అంతటి ప్రమాదకారిని కానట్లయితే, నా జీవితంలోని ఆరు నెలలను నాకు కాకుండా చేసినందుకు ఎవరు సమాధానం చెబుతారు? ఈ ప్రశ్నను నేను కోపంతో అడగడం లేదు. ఆ ఆరు నెలలు నాకు ఎంతో నేర్పించాయి. అయితే ఈ ప్రశ్న ముఖ్యమైనది. ఎందుకంటే రేపు సోనమ్ వాంగ్‌చుక్ స్థానంలో ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే ప్రశ్న అడిగే ఏ సామాన్య భారతీయ పౌరుడైనా ఉండవచ్చు.

### వారు ఇలాంటి ఇబ్బందిని ఎదుర్కోవాల్సిందేనా?. లడఖ్ ప్రజలపై ఈ క్రిమినల్ కేసులు ఎప్పటిదాకా? లడఖ్ ప్రజలు ఇప్పటికీ తీవ్రమైన క్రిమినల్ కేసులను ఎందుకు ఎదుర్కొంటున్నారు?

సెప్టెంబర్ 24 ఘటనల అనంతరం 87 మందిని నిందితులుగా గుర్తించి, వారిలో 81 మందిని అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వారిలో 20 మందిపై కేసులను ఉపసంహరించుకోవడానికి పరిపాలనా యంత్రాంగం ఇప్పుడు ఆమోదం తెలిపింది. ఇది స్వాగతించదగిన పరిణామం.

### అయితే మిగిలిన వారి పరిస్థితి ఏమిటి?

ఈ కేసుల్లో చిక్కుకున్న వారిలో ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న సాధారణ ప్రజలు, పరిస్థితిని శాంతింపజేయడానికి వెళ్లిన స్వచ్ఛంద కార్యకర్తలు కూడా ఉన్నారని లడఖ్ ప్రజలు చెబుతున్నారు. కొందరిపై హత్యాయత్నం వంటి అత్యంత తీవ్రమైన ఆరోపణలతో కేసులు నమోదయ్యాయి. ఒక వ్యక్తి హింసకు పాల్పడినట్లు లేదా తీవ్రమైన నేరానికి పాల్పడినట్లు విశ్వసనీయ ఆధారాలు ఉంటే, చట్టం తన పని తాను చేసుకోవాలి. ఎవరూ చట్టానికి అతీతులు కాకూడదు. అదే సమయంలో, నిర్దోషి కూడా చట్టం ఇచ్చే రక్షణకు దూరం కాకూడదు. మిగిలిన అన్ని కేసులను కూడా జంతర్ మంతర్ నిరసనల కేసుల్లో అనుసరించిన విధంగానే పరిశీలించాలి.

### జోద్ పూర్

జైలులో నేను కలిసిన వ్యక్తుల కథలు విన్నప్పుడు, నాకు ఒక విషయం అవగతం అయింది.భారతదేశం అంతటా నేరం రుజువు కాకముందే నెలలు, కొన్ని సందర్భాలలో సంవత్సరాల తరబడి జైలులో గడిపే వ్యక్తులు ఉన్నారు. చివరకు సంవత్సరాల పాటు విచారణలు సాగిన తర్వాత కొందరు నిర్దోషులుగా విడుదలవుతారు. అయితే ఆ కోల్పోయిన సంవత్సరాలను వారికి ఎవరు తిరిగి ఇస్తారు. ఒక యువకుడికి అతని యవ్వనాన్ని ఎవరు తిరిగి ఇస్తారు? ఒక తండ్రి తన పిల్లలతో గడపలేకపోయిన సంవత్సరాలను ఎవరు తిరిగి ఇస్తారు? జీవనోపాధి, గౌరవం కోల్పోయిన కుటుంబాన్ని ఎవరు తిరిగి నిలబెడతారు? మన రాజ్యాంగం వ్యక్తి గౌరవం, స్వేచ్ఛతో ప్రారంభమవుతుంది. అయినప్పటికీ, చాలా మందికి నేరం రుజువు కాకముందే జైలులో ఉండటం శిక్షగా మారుతోంది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో జైలు వ్యవస్థ, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో సంస్కరణలు అవసరం. విచారణలో ఉన్న ఖైదీల నిర్బంధం, దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్‌లో జవాబుదారీతనం, అక్రమంగా స్వేచ్ఛను హరించిన సందర్భాల్లో పరిహారం, అసాధారణ చట్టాల దుర్వినియోగాన్ని నిరోధించే రక్షణ చర్యలను పరిశీలించాలి.

### జవాబుదారీతనం కేవలం నిందితులకే పరిమితం కాకూడదు.

దర్యాప్తు, ప్రాసిక్యూషన్ లేదా నిర్బంధం ఉద్దేశపూర్వకంగా, చట్టవిరుద్ధంగా లేదా తీవ్రమైన నిర్లక్ష్యంతో జరిగినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై కూడా అర్థవంతమైన చర్యలు ఉండాలి. ఇది పోలీసుల వ్యవస్థను బలహీనపరచడం గురించి కాదు. మన పోలీసు సిబ్బంది తరచూ తీవ్ర ఒత్తిడిలో చాలా కష్టమైన విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సంస్థను జవాబుదారీగా చేయడం ద్వారా ప్రతి సంస్థను మరింత బలోపేతం కావాలన్నదే నా అభిమతం.

### ప్రజాస్వామ్యం ప్రశ్నలకు ఎప్పుడూ భయపడకూడదు.

పౌరులు మౌనంగా ఉండే దేశం బలమైన దేశం కాదు. పౌరులు తమ ప్రభుత్వాన్ని శాంతియుతంగా ప్రశ్నించగలిగే దేశమే బలమైన దేశం. పోలీసులు గౌరవించబడటంతో పాటు జవాబుదారీగా ఉండాలి. నిర్దోషులకు రక్షణ లభించాలి. అత్యంత శక్తివంతమైన ప్రజా అధికార సంస్థ కూడా చట్టానికి సమాధానం చెప్పాల్సిందే.

లేహ్‌లో నలుగురి ప్రాణాలు కోల్పోయి ఏడాది గడిచింది. నేను జోధ్‌పూర్ జైలులో మొదటి ఉదయం గడిపి కూడా ఏడాది అయింది.

నేను ప్రతీకారం కోరడం లేదు.

నేను నిజం కోరుతున్నాను.

నేను న్యాయం కోరుతున్నాను.

నేను జవాబుదారీతనం కోరుతున్నాను.

మళ్లీ మళ్లీ లడఖ్‌లో జరిగినది.. అలాగే లెక్కలేనన్ని సామాన్య భారతీయులకు జరుగుతున్నది.. పునరావృతం కాకుండా సంస్కరణలు కోరుతున్నాను.ఇవి భారతదేశానికి వ్యతిరేకమైన డిమాండ్లు కావు.

మనమందరం గర్వించదగిన భారతదేశం కోసం పని చేద్దాం.

## ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..

*** వరంగల్ ఎయిర్ పోర్ట్ కు కొండ లక్షణ్ బాపూజీ పేరు పెట్టాలని సీఎంకు విజ్ఞప్తి**



**ముద్ర చిగురుమామిడి:** తెలంగాణ ప్రజల హక్కుల కోసం,సామాజిక న్యాయం కోసం,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర మల్లేశం తెలిపారు.ఆదివారం చిగురుమామిడి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగర మల్లేశం ఆధ్వర్యంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడితు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావడానికి తొలి దశ ఉద్యమంలో మలిదశ ఉద్యమంలో ఆయన త్యాగాలను గుర్తు చేసుకొని జయంతి కార్యక్రమం నిర్వహించారు.అలాగే వరంగల్ ఎయిర్ పోట్ కు స్వర్గీయ కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మంచికట్ల కనకయ్య,ఉపాధ్యక్షుడు ఎన్నం వెంకటేశ్వర్లు,బైరీ శ్రీనివాస్,గజ్జెల రాములు, కూరపాటి కిషోర్, కూరపాటి దిలీప్,మెరుగు రాజేశం,ఇతరులు పాల్గొనారు.

## ఉర్రూతలూగించిన మారథాన్ నాలుగవ ఎడిషన్



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నాలుగవ ఎడిషన్ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణు గోపాల్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరవాసుల ఆరోగ్యం దృష్ట్యా, డ్రగ్స్ రహిత సమాజం కోసం మారథాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3కె, 5కె, 10కె, 21కె రన్నింగ్, వాకింగ్, జాగింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

## మేము ఓట్లను చోరీ చేయం.. ప్రజల మనసులను గెలుచుకుంటాం..

**ముద్ర, హైదరాబాద్ :** బీజేపీ పార్టీ ఎన్నడూ ఓట్లను చోరీ చేయదు, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు, ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రసంగించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ గాంధీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం బాగానే పనిచేసినట్లు ప్రచారం చేసుకుని, ఇతర రాష్ట్రాల్లో బీజేపీ గెలిస్తే మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘం తప్పన్నట్లు మాట్లాడటం వారి అపరిపక్వతకు నిదర్శనమ న్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదని స్పష్టం చేశారు. 1975లో ఎమర్జెన్సీ విధించి పౌరహక్కులను కాలరాసిన చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.



తెలంగాణ ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు వెళ్లి "సోనియా గాంధీ కుటుంబం కోసం ప్రాణాలు అర్పిస్తా" అనడం సిగ్గుచేటని, ప్రజల సమస్యలను గాలికొదిలేసి గాంధీ కుటుంబ సేవలోనే గడుపుతున్నారని ఆక్షేపించారు. ఆర్మీ చీఫ్, సర్జికల్ స్ట్రైక్స్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సీజేఐ, ఈడీ, సీబీఐ, పార్లమెంట్, జీఎస్టీ వంటి రాజ్యాంగ, భద్రతా వ్యవస్థలన్నింటిపై రాహుల్ గాంధీ అనుమానాలు వ్యక్తం చేస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని తమ కుటుంబమే పాలించాలనే రాచరికపు అహంకారం రాహుల్ మాటల్లో కనిపిస్తోందన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు, ఉచిత రేషన్ వంటి సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తెచ్చిందని చెప్పారు. గత 11–12 ఏళ్ల మోదీ పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని తెలిపారు. స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వాన్ని కోరుకునే ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తున్నారని, కాంగ్రెస్ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గురించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే చనిపోయినవారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లతో సహా లక్షలాది అక్రమ ఓట్లను తొలగించడం జరుగుతోందని తెలిపారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దితే స్వాగతించాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం మానుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. అంతకుముందు, భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా పూర్తయినందుకు ఉత్సవ సమితికి, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి, నగర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

**ముద్ర, మంథని** : కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహనీయులకు పెద్ద పీట వేస్తోందని, వారి జయంతులు, వర్ధంతులు అధికారికంగా నిర్వహిస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం అన్నారు. పదేళ్లలో ఎంత దోచుకున్నావో ప్రజలందరూ గమనించి బుద్ధి చెప్పారన్నారు. ఇకనైనా వైఖరి మార్చుకోవాలన్నారు. సమావేశంలో మంథని మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్,ఎ లక్ట్రిసిటీ బోర్డ్ మెంబర్ శశిభూషణ్, మున్సిపల్ ఛైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడుదుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణలో 2బీ బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

**ముద్ర, హైదరాబాద్**: తెలంగాణలో 41 బార్ల(2బీ)కు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. క్యూర్ పరిధిలో 14.. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో 27 బార్లకు దరఖాస్తులను స్వీకరించనుంది. 2బీ బార్ల దరఖాస్తుకు రుసుము రూ.లక్షగా నిర్ణయించారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి అనుగుణంగా 2బీ బార్లు ఏర్పాటు చేయనున్నారు. క్యూర్ పరిధిలోని 2బీ బార్లకు ఏడాదికి రూ.44 లక్షలు, నిజామాబాద్ బోధన్ బార్‌కు రూ.42 లక్షలు, మిగిలిన 2బీ బార్‌లకు రూ.30 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం tgbcl.telangana.gov.in వెబ్ సైట్‌ను పరిశీలించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు.



**కడుపు ఉబ్బరం :**
భోజనం తర్వాత నడవండి. తిన్న వెంటనే పడుకోవడం కంటే 10–15 నిమిషాలు నడవడం మంచిది. తేలికపాటి నడక జీర్ణక్రియకు తోడ్పడి కడుపులో గ్యాస్ తగ్గేందుకు సహాయపడొచ్చు.



# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన సేవలు మరువలేనివని యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఓ నాగిరెడ్డి, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమాధికారి సుబ్బారెడ్డి , జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు,కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**బంజారాహిల్స్ 31వ వార్డులో..**

తెలంగాణ ఉద్యమ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని బంజారాహిల్స్ 31వ వార్డులో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బానోత్ సంతోష్ నాయక్,అధ్యక్షత వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్, వార్డు పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక**

**ముద్ర, హన్మకొండ, సెప్టెంబర్ 27:** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, నిస్వార్థ ప్రజాసేవకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువెత్తు నిదర్శనమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు హన్మకొండ హంటర్ రోడ్డులోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాపూజీ నిలువెత్తు విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షలకు మద్దతుగా నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం నుంచి తన పదవిని తృణప్రాయంగా త్యజించిన గొప్ప ధైర్యశాలి అని కొని యాడారు. అధికారం కంటే ప్రజల ఆత్మగౌరవమే ముఖ్యమని నిరూపించిన మహనీయుడని, మలిదశ ఉద్యమంలో సైతం వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షలు చేపట్టి యువతరంలో పోరాట స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి, సహకార రంగ పటిష్టతకు బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, మేర కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట్రాజం, కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ఐజేయూ హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేత, తపాలా ఉద్యోగుల సంఘం ఆల్ ఇండియా ప్రెసిడెంట్ బొద్దుల వెంకటేశ్వర్లు, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ్ సాగర్ పాటు ప్రజాసంఘాల నాయకులు, చేనేత ప్రతినిధులు హాజరై బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

# పర్యాటక రంగంలో కృత్రిమ మేధస్సును వినియోగించాలి

**జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు**
**ఘనంగా భువనగిరి ఖిల్లాపై ప్రపంచ పర్యాటక దినోత్సవం**






**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సును విస్తృతంగా వినియోగించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.ఆదివారంప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని "పర్యాటకాన్ని పునఃరూపకల్పన చేయడానికి డిజిటల్ ఎజెండా, కృత్రిమ మేధస్సు" అనే అంశంపై జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో భువనగిరి ఖిల్లాపై ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటకం కేవలం ఒక ప్రాంతాన్ని సందర్శించడం మాత్రమే కాదని, మన చరిత్ర, సంస్కృతి, కళలు, సంప్రదాయాలు, ప్రకృతి అందాలను ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప వేదిక అని అన్నారు. పర్యాటక రంగం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి, ఆదాయం, అభివృద్ధికి అనేక అవకాశాలు కలుగుతాయని తెలిపారు. జిల్లాలో మరిన్ని టూరిజం క్లబ్‌లు, పర్యాటక గమ్యస్థానాలను అభివృద్ధి చేసి యాదాద్రి భువనగిరి జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.జిల్లా యువజన, క్రీడల అధికారి ధనంజనేయులు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్, డిజిటల్ మ్యాప్స్, ఆన్‌లైన్ బుకింగ్, వర్చువల్ టూర్స్ వంటి సాంకేతికతలు పర్యాటక రంగాన్ని మార్చాయని తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా పర్యాటకుల సమయం, బడ్జెట్, ఆసక్తులకు అనుగుణంగా ప్రయాణ ప్రణాళికలు రూపొందించవచ్చని, పర్యాటక ప్రాంతాల్లో డిజిటల్ గైడ్లు, ఏఐ ఆధారిత చాట్‌బాట్ల ద్వారా అనేక భాషల్లో తక్షణ సమాచారాన్ని అందించవచ్చని వివరించారు. చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోటలు, ప్రకృతి ప్రదేశాలకు సంబంధించిన ఆడియో, వీడియో, డిజిటల్ సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ప్రసంగం, ఎలక్యూషన్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు షీల్డులు, మెమెంటోలు అందజేసి అభినందించారు. వ్యాసరచనలో జి. జ్యోతి, ఎం. విజయలక్ష్మి , చిత్రలేఖనంలో ఉమా, గీత, ప్రసంగంలో వీణ, కవిత విజేతలుగా నిలిచారు.యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు యాదగిరిగుట్ట ఆలయంలో శాస్త్రీయ నృత్యం, సురేంద్రపురి, పాతగుట్టపై రీల్స్, స్కిట్లు, అవగాహన వీడియోలు రూపొందించారు. సంస్థాన్ నారాయణపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాచకొండ కొండల చారిత్రక ప్రదర్శన, రీల్స్, స్కిట్లు, పర్యాటక గైడ్ కార్యకలాపాలు నిర్వహించారు. ఇతర కళాశాలలు స్కిట్లు, నృత్యాలు, రీల్స్, లఘు వీడియోలు, వారసత్వ–పర్యాటక అవగాహన కార్యక్రమాలు, ఆహార ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి.జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన మూడు పాఠశాలలు, మూడు కళాశాలలకు సంబంధించిన గైడ్ టీచర్లకు షీల్డులు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది మురళి, రేఖ, జయ, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భువనగిరి ఆర్ డి ఓ కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఏ పీడీ నాగిరెడ్డి, యువజన సంఘం నాయకుడు సరగడ కరుణ్, హెరిటేజ్ కమిటీ సభ్యులు దిద్ది బాలాజీ, అంజయ్య,, కౌన్సిలర్ బండారు స్వర్ణలత పాల్గొన్నారు.

## ఘనంగా ఉచిత క్యాన్సర్, వైద్య పరీక్షల శిబిరం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరి పట్టణంలో ఉచిత క్యాన్సర్, వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాకోటి నాగేష్,అసిస్టెంట్ గవర్నర్ పక్కీరు కొండల్ రెడ్డి,రోటరీ క్లబ్ అధ్యక్షులు కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి,సెక్రటరీ కడారి రమేష్ బాబు, ట్రెజరర్ పెండెం వేణుగోపాల్, యంపల్ల బుచ్చి రెడ్డి, జి. జ్ఞాన ప్రకాష్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, ఎం.ఎ. రహీం, శెట్టి బాలయ్య యాదవ్, మంచికంటి వెంకటేశం, ఎస్.పి. ఉపేందర్ రావు, ఎస్.పి. స్పందన, ఎం.డి. హనీఫ్ మెమన్ పాల్గొనగా ఈ హెల్త్ క్యాంపు కోసం భువనగిరి ప్రిన్స్ మెడికల్ హాల్ అధినేత జాకీర్ సుమారు రూ.లక్ష విలువైన మందులను ఉచితంగా అందజేశారు. వివేరా హోటల్ సద్ది వెంకట్ రెడ్డి భోజనాన్ని ప్రజలకు ఉచితంగా అందజేశారు.

## గణనాధునికి చందా



**ముద్ర, వలిగొండ:** మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ నెలకొల్పిన గణనాధునికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి ఆదివారము 5000 రూపాయల చందాను అందజేశారు అదేవిధంగా ఆవుల స్వామి 2000 రూపాయల చందాను అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి, బుర్ర శ్రీకర్, బత్తిని కర్ణ గౌడ్, గుడిగ మోహన్, వల్లపు ప్రవీణ్, పాక మహేష్, మర్రి నరేష్, వల్లపు శివ ,నూకల ఉదేశ్, జినుకల మహేష్, ముత్యాల గణేష్, మహేష్, సతీష్, శివ, మణిదీప్, మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ జెండా ఆవిష్కరణ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని గాంధీ పార్క్‌లో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు షేక్ వాజీద్, పీసీసీ జనరల్ సెక్రటరీ పోత్నక్ ప్రమోద్ కుమార్, పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర నాయకులు దరిపల్లి ప్రవీణ్ కుమార్, సరిగడ అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బూరి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ మాజీ అధ్యక్షులు సామల రవీందర్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు అంకం రాజు, బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ఉప్పునూతల రాజా శేఖర్ పాల్గొన్నారు.

## మహా గణనాథుని ఆశీస్సులు అందరికి ఉండాలి



**ముద్ర, దేవరకొండ:** గడ్డం ఎన్ క్లేవ్ లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఊరేగింపులో తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ దేవరకొండ ఇంచార్జ్ నేనావత్ శివ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులుఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని డప్పు వాయిద్యాలు, భజనల నడుమ, జై బోలో గణేష్ మహారాజ్ కీ జై నినాదాలతో నిమజ్జనం పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, సోమా నాయక్, నీలా జ్ఞానేశ్వర్, జగన్ రెడ్డి, సురేష్, వీరన్న, చిన్నారులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 27 :** పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ దివాకర టివిఎస్, సీపీ సునీల్ దత్‌లతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చింతకాని చెరువు వద్ద రూ.7.90 కోట్లతో పర్యాటక వసతుల కల్పనతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రూ.13.68 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తి చేయాలి**

లక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టివిఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌లతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్ సముదాయాలు, ల్యాబ్‌లు, కిచెన్ , డైనింగ్ హాల్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు.పనుల్లో ఎలాంటి ఆలస్యం, అలసత్వం ఉండకూడదని, కార్మికుల సంఖ్యను పెంచి వచ్చే మార్చి నాటికి నిర్మాణాలన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. సమాజంలో కుల, మత, వర్గ, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరూ ఒకేచోట నాణ్యమైన విద్యను అభ్యసించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పాఠశాలలను నిర్మిస్తోందని ఆయన స్పష్టం చేశారు. విద్య ద్వారానే అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.

**బూత్ లెవెల్ ఏజెంట్లే కాంగ్రెస్‌కు మూలస్తంభాలు**

కాంగ్రెస్ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి మూలస్తంభాలని, వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నాగులవంచలో నిర్వహించిన కాంగ్రెస్ బిఎల్‌ఏల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పాఠశాలలు, రోడ్లు, ఆసుపత్రుల అభివృద్ధి పనులను రాబోయే రెండేళ్లలో వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో కోటి 6 లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 'గృహజ్యోతి' కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. పేదల వైద్యం కోసం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని, నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా కల్పించే 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం, పాలు అందిస్తున్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీను బాబు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలి




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 27 :** జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బి.ఆర్.టి.యు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.ఆర్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఆశాల వేతనాన్ని రూ. 9,750లకు పెంచడంతో పాటు ప్రసూతి సెలవులు మంజూరు చేశారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆశాలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 18 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, టార్గెట్లను ఎత్తివేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. సంతోష, బి.ఆర్.టి.యు నాయకులు పాషా, పగడాల నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.సంఘ జిల్లా అధ్యక్షురాలుగా దాసరి శైలజ, రాష్ట్ర కార్యదర్శి గా సులోచనను నియమించారు

## నేటి నుంచి ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 27 :** దేశంలో కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం, కౌలు రైతుల హక్కులు, రుణమాఫీ, ఉపాధి హామీ చట్టం బలోపేతం వంటి కీలక అంశాలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించడమే లక్ష్యంగా ఖమ్మంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాలుగో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్టు సంఘ నేతలు తెలిపారు. టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు జేవీ చలపతిరావు తదితరులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో 18 రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు పాల్గొంటున్నట్లు వివరించారు. తొలిరోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని, గత పదేళ్ల పోరాటాలను సమీక్షించుకుని ముందడుగు వేస్తామని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం చట్టబద్ధమైన మద్దతు ధర కల్పించకపోవడం వల్లే దేశంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని, తెలంగాణలో 40 శాతం ఉన్న కౌలు రైతులకు సరైన గుర్తింపు, బ్యాంక్ రుణాలు, సబ్సిడీలు దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల ద్వారా ఉమ్మడి ఉద్యమ ప్రణాళికను ఖరారు చేస్తామని తెలిపారు.

## ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కందుల మధు, ఉప్పల శాంతి కుమార్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆలేరు పట్టణంలో శనివారం జరిగిన ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా 4వ మహాసభ లో యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐఎస్ఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కందుల మధు, ఉప్పుల శాంతి కుమార్, ఉపాధ్యక్షులుగా చిప్పలపల్లి నవీన్, సహాయ కార్యదర్శి గా లోకేష్, కోశాధికారిగా జిట్టా గౌతం 19మంది నూతన కౌన్సిల్ సభ్యులతో జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందుల మధు, ఉప్పుల శాంతి కుమార్ లు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పక్షాన పోరాటాలు నిర్వహించి మండలాల ఏఐఎస్ఎఫ్ నిర్మాణం చేసి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై పోరాడుతామని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 28.09.2026
www.mudranews.in | @mudranews



**కడుపు ఉబ్బరం :**



నెమ్మదిగా తినండి ఆహారాన్ని వేగంగా తినడం వల్ల గాలిని ఎక్కువగా మింగే అవకాశం ఉంటుంది. దీంతో కడుపు ఉబ్బరం పెరగొచ్చు. అందుకే ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినడం మంచిది.

# ఘనంగా పర్యాటక దినోత్సవం

**16 కళారూపాలతో భారీ ర్యాలీ**
**మెదక్ పర్యాటక కేంద్రాలను ప్రపంచానికి పరిచయం చేయాలి**
**హాజరైన ఎంపీ రఘునందన్ రావు**







**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం 4 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మెదక్ ఖిల్లాపై కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు ప్రారంభించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు హాజరయ్యారు. మెదక్ ఖిల్లా సందర్శన టికెట్ కౌంటర్ ను ప్రారంభించారు. అనంతరం ర్యాలీ మెదక్ ఖిల్లా నుంచి వెస్లీ కళాశాల వరకు సాగింది. ఈ ర్యాలీలో డప్పు, డోలు, తంబుర, చిందు, భాగవత, బోనాలు, బతుకమ్మ, గిరిజన లంబాడ, గీత కార్మికులు, కరాటే, ఎన్సిసి విద్యార్థులు, ఒగ్గుతదితర తదితర కళాకారులు వారి వేషధారణలో పాల్గొన్నారు. అనంతరం వెస్లీ కళాశాలలో పర్యాటక రంగ ఆడియో విజువల్స్ వీక్షించారు.శాంతి సందేశానికి సూచికగా ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక పావురాలను ఎగురవేసి, మెదక్ పర్యాటక అధికారిక వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. టూరిజంలో ముందుకెళ్తున్న భారత్ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టిన చరిత్ర మెతుకు సీమ మెదక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పర్యాటక రంగంలో మొదటి బహుమతి పొందిన కలెక్టర్ ప్రతిమా సింగ్ ను అభినందించారు. మోదీ నాయకత్వంలో భారతదేశంలో పర్యాటక రంగం చాలా అభివృద్ధి సాధించిందని, ప్రపంచంలో ఉన్న 175 దేశాలు భారతదేశంలోని పర్యాటక సంస్థలను సందర్శిస్తున్నారని అన్నారు. భారత్ టూరిజంలో చాలా ముందు కెళ్తుందని తెలిపారు. శని, ఆదివారాల్లో పర్యాటక ప్రేమికుల దృశ్య ట్రాఫిక్ నియంత్రించాలని సూచించారు.మెదక్ జిల్లా ప్రకృతిని కాపాడాలన్నారు. ప్రకృతి, టూరిస్ట్ ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. ప్లాస్టిక్ బదులుగా స్టీల్ వస్తువులను ఉపయోగించాలన్నారు. జిల్లా యంత్రాంగం పర్యాటక అభివృద్ధి కోసం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో మెదక్ జిల్లా వెనకబడిందన్నారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ వచ్చిన తర్వాత మెదక్ అభివృద్ధికి కొత్త ఊపొచ్చిందని ప్రశంసించారు. ఆదిలాబాద్, ములుగు జిల్లాలకు పోటీగా మెదక్ టూరిజం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. పోచారం అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ పార్క్, ఏడుపాయల వనదుర్గ, మెదక్ చర్చి తదితర ప్రాంతాలు మరింత అభివృద్ధి చేయాలన్నారు.మెదక్ జిల్లాను ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ కృషి చేస్తుందన్నారు.నర్సాపూర్ అడవుల అందాలను సినీ పరిశ్రమ కూడా గుర్తించిందన్నారు. పర్యాటక అభివృద్ధితో హోటళ్లు, టూరిస్ట్ గైడ్లు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రపంచ చిత్రపటంలో టూరిజం ర్యాంకింగ్ విషయంలో భారతదేశం 69వ స్థానంలో ఉండేదని, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక 39 వ స్థానానికి ఎదిగిందన్నారు. ప్రపంచ పర్యాటక పటంలో భారత్ స్థానం మెరుగుపడుతోందనీ వివరించారు. మెదక్ పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని యువతకు పిలునిచ్చారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్థానిక భాష నేర్చుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మన ప్రాంతంలో పుట్టిన మనమే మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.మన ఊరు.. మన ప్రాంతం.. మనమే రక్షించుకోవాలని కోరారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో చాలా చారిత్రక వారసత్వ, సాంస్కృతిక సంపద కలిగి ఉందని, దానిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరి దన్నారు. పర్యాటక సర్క్యూట్ గా చేసేందుకు 14 ప్రదేశాలను గుర్తించామన్నారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రదేశాలను ప్రపంచ స్థాయి గుర్తింపు తేవడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో టూరిజం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి మార్గాలు లభిస్తాయని తెలిపారు. అదనపు ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ .. జిల్లా చారిత్రక ప్రదేశాలను, వారసత్వ సంపదను భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో అనేక వారసత్వ సంపదను కలిగి ఉండడం జిల్లా ప్రజల అదృష్టం అన్నారు. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చి మెదక్ ను సందర్శించేలా ప్రజల సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంపై చదివిన కవిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మేమంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈవో, జిల్లా టూరిజం అధికారి ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, స్పోర్ట్స్ ఆఫీసర్ రమేష్, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందిస్తాం

**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**





**ముద్ర, సూర్యాపేట:** తీవ్ర అనారోగ్యం, ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 5,319 మంది లబ్దిదారులకు రూ.21.62 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయిన పేద కుటుంబాలను ఆదుకోవడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించి, బాధితులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 5,319 కుటుంబాలకు రూ.21.62 కోట్ల మేర ఆర్థిక సాయం అందడం ప్రత్యేకమన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన నిధులు అనేక పేద కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు దోహదపడ్డాయని చెప్పారు.ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంప్రజారోగ్య పరిరక్షణతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.సీఎంఆర్ఎఫ్ సాయం పొందిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ హరి సింగ్, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ రాధికా దేశ్‌ముఖ్, గ్రంథాలయ చైర్మన్ బచ్చు రామారావు, తహసీల్దార్ కవిత, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**భవిష్యత్ ప్రధానిగా రాహుల్‌గాంధీ వైపే దేశం చూపు**

కేంద్ర ఎన్నికల సంఘంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో దేశ ప్రజల దృష్టి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ వైపు ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం నెరేడుచర్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణపై రాహుల్‌గాంధీ చాలా కాలంగా పోరాడుతున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాహుల్ లేవనెత్తిన అంశాలపై చర్చకు దారితీశాయని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదని, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటుకు రక్షణ ఉండాలని అన్నారు.ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం ఇవ్వాలని, 'ఓట్ చోరీ'పై రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందన్నారు.తెలంగాణలోని ప్రతి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామాన్ని కాంగ్రెస్ బలమైన స్థావరంగా మార్చేందుకు కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. దేశానికి ప్రజల మాట వినే నాయకత్వం అవసరమని, రాహుల్‌గాంధీని భవిష్యత్ ప్రధానమంత్రిగా స్వాగతించేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

**కలెక్టర్ ప్రతిమా సింగ్**







**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలనుకలెక్టర్ క్యాంప్ ఆఫీస్ లో నిర్వహించారు. చిత్రపటానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాపూజీ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాసేవ మార్గాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు.కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.డీఎస్పి ప్రసన్న కుమార్ నివాళులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఎస్పీ ప్రసన్న కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు మహేష్, శైలెందర్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.బాపూజీ ఆశయాలు కొనసాగించాలి: వైస్ చైర్మన్ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మెదక్‌లో తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ రాజశేఖర్, మన్సూర్, నాయకులు బొద్దుల కృష్ణ, నవీన్, ఒమర్, సమ్మి తదితరులు పాల్గొన్నారు.

## వన దుర్గ సేవలో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం



**ముద్ర ప్రతినిధి, మెదక్ :** ఏడుపాయల వన దుర్గమాత అమ్మవారినితెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఆలయ కార్యనిర్వాహకులు,అర్చకులు వేదమంత్రాలతో అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారిని దర్శన భాగ్యం కలగడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని మెదక్ టౌన్ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, 8 వేల రూపాయల నగదు మొత్తంగా 14,38,000 సొత్తును స్వాదీనం చేసుకున్నారు. మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ డి. మహేష్ కథనం ప్రకారం...హవేలి ఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్ కుమార్ ఆదివారం చమన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు గమనించగా అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారించారు. మెదక్ పట్టణం పిట్లంబేస్ కు చెందిన మల్లారెడ్డిపేట రామవ్వ ఒంటరిగా నివసిస్తుండగా ఈనెల 18న ఉదయం అధిక రక్తపోటుతో బాధపడుతూ ఇంటికి తాళం వేసి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. 20న చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న ఆమె ప్రధాన తలుపు తాళం లేకపోవడాన్ని గమనించి, ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు, నగదు కనిపించలేదు. సుమారు 10 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు, మొత్తం సుమారు రూ.3,30 లక్షల విలువైన ఆస్తి చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు.నిందితుడి చూపించిన మేరకు చోరికి గురైన ఆస్తిని పంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హవేలిఘనపూర్ ఎల్లమ్మ దేవాలయం తాళం పగులగొట్టి దేవాలయంలో హుండీని పగులగొట్టి సుమారు రూ.30 వేల నగదు దొంగిలించాడు. రెండు పుస్తెలు, మూడు ముక్కుపుడకలు, రెండు బంగారు కళ్లు,బంగారు బొట్టు బిళ్ల, వెండి కళ్లు, వెండి ఉయ్యాలలు కూడా చోరీ చేసినట్లు వెల్లడించాడు. అతని వద్ద మిగిలిన వెయ్యి రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. భిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైతం దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## గ్రామీణ యువతకు ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** యూపీఎస్సీ, టీజీపీఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కోచింగ్ సెంటర్లు, ఆధునిక సౌకర్యాలతో కూడిన లైబ్రరీలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి డా. జీ. చిన్నారెడ్డి కోరారు. గ్రామీణ విద్యార్థులు స్వయంగా చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అనుకూల వాతావరణం కల్పించాలని, గ్రూప్–1 పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. సివిల్ సర్వీసెస్ తరహాలో గ్రూప్–1 నియామక ప్రక్రియను ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ అనే మూడు దశల్లో నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.ముఖ్యంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను యూపీఎస్సీ ద్వారా తెలంగాణలో నిర్వహించే అవకాశాన్ని పరిశీలించాలని చిన్నారెడ్డి కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం రాష్ట్ర అవసరాలకు యూపీఎస్సీ సేవలు అందించే అవకాశం ఉందని, ఈ నిబంధన ఆధారంగా తెలంగాణ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు యూపీఎస్సీని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించవచ్చని తెలిపారు.యూపీఎస్సీ ద్వారా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తే పారదర్శకత పెరగడంతో పాటు పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహిస్తే యువత ముందుగానే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు తొమ్మిదిన్నరేళ్ల పాటు గ్రూప్–1 పోస్టుల నియామకాలు చేపట్టలేదని చిన్నారెడ్డి విమర్శించారు. గతంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు సంబంధించి పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాల్సి వచ్చిం దని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్–1 పరీక్ష నిర్వహించి నియామక ప్రక్రియను చేపట్టిందని, యూపీఎస్సీ తరహాలో దశలవారీగా పరీక్షలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పారదర్శకంగా, క్రమబద్ధంగా నియామక ప్రక్రియ కొనసాగిస్తూ అభ్యర్థులకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



**ముద్ర, కూకట్‌పల్లి:** స్నేహితులతో కలిసి మద్యం సేవించిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి చెందిన కాకుమాని రామకృష్ణ (29) కేపీహెచ్‌బీలోని సర్దార్ పటేల్ నగర్‌లో నివాసముంటున్నాడు.ఈ నెల 26న రాత్రి రామకృష్ణ తన రూమ్‌మేట్స్, స్నేహితులతో కలిసి ఫ్లాట్ ఎదురుగా ఉన్న హాల్‌లో మద్యం సేవించాడు. రాత్రి 11 గంటల నుంచి 12 గంటల మధ్య రామకృష్ణ వాంతులు చేసుకున్నట్లు స్నేహితులు తెలిపారు. అనంతరం భోజనం చేయకుండానే నిద్రపోయాడు.27వ తేదీ తెల్లవారుజామున 2 నుంచి 2.30 గంటల మధ్య స్నేహితుడు సంతోష్ బయటకు వస్తుండగా రామకృష్ణ కుర్చీల మధ్య అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించాడు. ఎంత పిలిచినా స్పందించకపోవడంతో స్నేహితులు అతడిని ఆటోలో నిజాంపేట్ రోడ్డులోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పల్స్ పడటం లేదని వైద్యులు తెలిపారు. తెల్లవారుజామున 4.30 గంటలకు రామకృష్ణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు.విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు కాకుమాని అజయ్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని తమ్ముడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. రామకృష్ణ మృతికి దారితీసిన పరిస్థితులు, అసలు కారణాలను వెలికితీసి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555